ఇక్కడ చదివితే నవోదయమే

- సీటు సాధిస్తే ఉజ్వల భవిష్యత్తు
- అత్యుత్తమ ప్రమాణాలతో విద్యా బోధన
- ఆరో తరగతిలో ప్రవేశానికి ఈ నెల 13న పరీక్ష

6

వేటలో శిక్షణకు బస్సుల్లో బయలుదేరిన మత్స్యకారులు



జెండా ఊపి బస్సులను ప్రారంభిస్తున్న తుమ్మల రామస్వామి, దొరబాబు

కొత్తపల్లి, డిసెంబరు 8(ఆంధ్రజ్యోతి): తీర ప్రాంత మత్స్యకారుల జీవనోపాధి అభివృద్ధికి మత్స్యకార జీవన ఉపాధి శిక్షణ యాత్ర ఎంతో ఉపయోగపడుతుందని మాజీ ఎమ్మెల్యే పెండెం దొరబాబు, డీసీసీబీ చైర్మన్ తుమ్మల రామస్వామి అన్నారు. కొత్తపల్లి మండలం ఉప్పాడకు చెందిన 60మంది తీరప్రాంత మత్స్యకారులకు డిప్యూటీ సీఎం, పిఠాపురం ఎమ్మెల్యే కొణిదెల పవన్‌కల్యాణ్ చొరవతో రాష్ట్ర, కేంద్రంసహకారంతో తమిళనాడు, కేరళ రాష్ట్రాలకు వారంరోజుల శిక్షణకు బయలుదేరిన బస్సులను వారు జెండా ఊపి యాత్ర ప్రారంభించారు. మత్స్యకారులకు రాబోయేరోజుల్లో మత్స్యసంపదతోపాటు జీవనోపాధి పెంపొందించడానికి కేరళ రాష్ట్రం మండపంలోని అత్యాధునిక సదుపాయాలను పరిశీలించడం ద్వారా ఆ పద్ధతులను ఉప్పాడ తీరంలో ప్రవేశపెడితే వీరి జీవనోపాధి మెరుగుపడుతుందని డీసీసీబీ చైర్మన్ రామస్వామి తెలిపారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్ తీరప్రాంత మత్స్యకారులపై ఉన్న ప్రేమాభిమానాలతో వారి జీవనోపాధిని మెరుగుపరచాలనే ఆలోచన చేశారని మాజీ ఎమ్మెల్యే దొరబాబు అన్నారు. మత్స్యకారులకు వేట, జీవనోపాధిపై లోతైన అధ్యయనం చేశారని తెలిపారు. దీనిలోభాగంగా వారంరోజులపాటు తీరప్రాంత మత్స్యకారులకు తమిళనాడు, కేరళ రాష్ట్రాల్లో అక్కడ వేట చేసే విధానం జీవనోపాధి పెంపొందించే మార్గాలపై అవగాహన, శిక్షణకోసం డిప్యూటీ సీఎం బస్‌యాత్ర ఏర్పాటు చేశారన్నారు. తీరప్రాంత మత్స్యకారుల అభ్యున్నతికి అహర్నిశలు పాటుపడుతూ డిప్యూటీ సీఎం ఆచరణలోకి తీసుకొస్తున్న విధానాలను కొందరు వక్రీకరించడం భావ్యంగా లేదన్నారు. తీరప్రాంత సర్పంచ్‌లు ఉమ్మిడి జాన్, నక్కా మణికంఠ, ఫైవ్‌మెన్ కమిటీ సభ్యుడు ఓదూరి కిషోర్, మత్స్యకార నాయకులు పల్లేటి బాపన్నదొర, వాడ్ర ధనబాబు, మత్స్యశాఖ అధికారులు పాల్గొన్నారు.



నన్నయ విశ్వవిద్యాలయంలో పుస్తకావిష్కరణ చేస్తున్న వెంకయ్యనాయుడు

- మాజీ ఉపరాష్ట్రపతి వెంకయ్యనాయుడు
- నన్నయలో 'భారతీయ భాషల్లో ఏకరూప శాస్త్రీయ సాంకేతిక పదజాలం'పై రెండు రోజుల కార్యశాల ప్రారంభం

6

అమ్మ.. అనే పిలుపులో మాధుర్యం **మమ్మీలో ఉండదు!**

రాజమహేంద్రవరం నాకు సెకండ్ హోమ్



- గోదావరి జిల్లాల ప్రజల ఆదరణ, ఆప్యాయతలు ఎనలేనివి
- ప్రస్తుతం ఏ రాజకీయ పార్టీలోను లేను
- నాకు ప్రేరణ మా ఆంటీ విజయనిర్మల
- 'ఆంధ్రజ్యోతి' ఇంటర్వ్యూలో సహజనటి జయసుధ

6

తూకం.. మోసం!

- చేబ్రోలు పట్టు మార్కెట్‌లో తూనికల మోసం
- 100 కిలోలకు 2.50 కిలోల తరుగు
- పట్టు రైతుల ఆందోళన

7

చర్చిలను తెరిపించాలి

7

- కాకినాడ కలెక్టర్‌ను కోరిన గొల్లప్రోలుకు చెందిన పాస్టర్లు

బోగస్‌లే.. కదిలేదిలే..



ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా కేంద్ర సహకార బ్యాంకును మొండిబాకీలు వెన్నాడుతున్నాయి. ఏళ్లకు ఏళ్లు వసూలవక చుక్కలు చూపిస్తున్నాయి. అసలు వస్తాయోరావోనన్నట్టు ఏడిపిస్తున్నాయి. అయితే అత్యధిక బాకీలు బోగస్‌వే ఉండడంతో అధికారులు వీటి వసూలుపై ఆశలు వదిలేసుకుంటున్నారు. చాలావరకు రికార్డులు కంప్యూటరీకరణ కాకపోవడంతో కాగితాలపై రుణాలు చూపించి బోగస్ వ్యక్తులు అధికంగా డీసీసీబీ డబ్బును మింగేశారు. ప్రధానంగా గత వైసీపీ హయాంలో దొంగ రుణాలు భారీగా నమోదయ్యాయి. 2019లో వైసీపీ అధికారంలోకి వచ్చే సమయానికి డీసీసీబీ మొండి బాకీలు రూ.200 కోట్ల వరకు ఉంటే, వైసీపీ గద్దె దిగే సమయానికి మొండిబాకీలు రూ.980 కోట్లకు చేరాయంటే ఏస్థాయిలో డీసీసీబీ డబ్బును అప్పటి అధికార పార్టీ నేతలు దిగమింగేశారో అర్థం చేసుకోవచ్చు.

- ఉమ్మడి తూర్పుగోదావరిలో రూ.980 కోట్లకు చేరిన డీసీసీబీ మొండిబాకీలు
- వసూలు చేయడానికి అధికారుల నానా తంటాలు
- వీటిలో బినామీ రుణాలే అధికం కావడంతో ఏంపాలుపోని పరిస్థితి
- 2019 నాటికి డీసీసీబీ బాకీలు రూ.200 కోట్లే.. వైసీపీ వచ్చాక రూ.980 కోట్లకు
- మార్చి సమీపిస్తుండడంతో తొమ్మిది బృందాలతో వసూళ్లకు ప్రణాళిక

(కాకినాడ-ఆంధ్రజ్యోతి)

కాకినాడ కేంద్రంగా పనిచేసే ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా కేంద్ర సహకార బ్యాంకును మొండిబాకీలు వెన్నాడుతున్నాయి. మూడేళ్లకుపైగా రూ.980 కోట్ల రుణాలు వసూలవక ఎన్‌పీఏలుగా మారాయి. వాస్తవానికి ఏదైనా బ్యాంకు రుణం మంజూరు చేయాలంటే అన్ని రకాల పత్రాలు తీసుకునే అప్పు మంజూరు చేస్తాయి. ఆనక వసూలవకపోతే ఆస్తులు వేలం వేసయినా డబ్బు రాబట్టుకుంటాయి. కానీ డీసీసీబీ రూటే వేరు. అన్నదాతలకు ఈ బ్యాంకు బ్రాంచ్‌ల ద్వారా వ్యవసాయానికి సంబంధించి స్వల్పకాలిక, దీర్ఘకాలిక రుణాలు మంజూరు చేస్తుంటుంది. అయితే అనేకమంది రైతులు తమ భూమి పత్రాలు చూపించి లక్షల్లో మాత్రమే డీసీసీబీ బ్రాంచ్‌ల్లో రుణాలు తీసుకుంటారు. వీరి విషయంలో అధికారులు సవాలక్ష నిబంధనలు అమలుచేస్తారు. కానీ పలుకుబడి కలిగిన రాజకీయ నేతల విషయంలో మాత్రం వారు సూచించిన వ్యక్తుల విషయంలో పెద్దగా నిబంధనలు పాటించకుండా చూసీచూడనట్టు వ్యవహరిస్తారు. ఇక్కడే డీసీసీబీ డబ్బు దొంగరుణాల ద్వారా బయట వ్యక్తుల పరమవుతోంది. ప్రధానంగా పలు బ్రాంచ్‌ల్లో సిబ్బంది అక్రమార్కులతో చేతులు కలిపి బోగస్ రుణాలు జారీచేసి కోట్లకుకోట్లు గడచిన కొన్నేళ్లలో స్వాహా చేసేశారు. దొంగ పత్రాలు చూపించి, లేని భూములను రికార్డుల్లో చూపించి కోట్లకుకోట్లు రుణాలు మంజూరు చేసి తలాకొంచెం పంచుకు తినేశారు. ప్రధానంగా కిర్లంపూడి సొసైటీలో రూ.104 కోట్ల అవినీతి ఈ ఏడాది బట్టబయలైంది. రాజకీయ ప్రమేయంతో గత కొన్నేళ్లుగా మూలనపడ్డ విచారణను కూటమి ప్రభుత్వం రాగానే వేగం పుంజుకుంది. ఈ నేపథ్యంలో పెద్దాపురం డివిజనల్ సహకార అధికారి పద్మ విచారణ జరిపి ఈ ఏడాది జనవరిలో జిల్లా సహకార అధికారికి పూర్తిస్థాయి నివేదిక అందించారు. ఇందులో సొసైటీ సీఈవోలు, మేనేజర్లు, సూపర్‌వైజర్లు అంతా కలిపి ఈ అవినీతికి పాల్పడ్డారని నివేదికలో గుర్తించారు. అలాగే ఏలేశ్వరం సొసైటీ పరిధిలోను ఇలాగే బోగస్ రుణాలు మంజూరు చేశారు. బ్యాంకు కాగితాలపై ఉన్న రుణం తీసుకున్న వ్యక్తుల పేర్ల ఆచూకీ కూడా కనిపించడం లేదు. ఇలా ఎక్కడికక్కడ బ్యాంకు డబ్బును అక్రమార్కులు కాజేశారు. డీసీసీబీ బ్రాంచ్‌ల్లో రికార్డులు కంప్యూటరీకరణ కాకపోవడాన్ని అడ్డంపెట్టుకుని వైసీపీ గత అయిదేళ్ల పాలనలో అడ్డగోలుగా మింగేశారు. మరో మూడు నెలల్లో ప్రస్తుత ఆర్థిక సంవత్సరం ముగియనున్న నేపథ్యంలో మొండిబాకీల లెక్కలు తేల్చడానికి కసరత్తు ప్రారంభించిన అధికారులు ఈనెల 3 నాటికి ఉమ్మడి జిల్లాలో బ్రాంచ్‌ల వారీగా మొండిబాకీలు లెక్కలు తేల్చగా కళ్లుబైర్లు కమ్మే అంకెలు తేలాయి. ఉమ్మడి జిల్లాలోని 53 డీసీసీబీ బ్రాంచ్‌ల్లో కలిపి ఎన్‌పీఏ బాకీలు రూ.980.72 కోట్లు తేల్చారు. ఇందులో అత్యధికంగా ప్రత్తిపాడు బ్రాంచ్‌లో రూ.332 కోట్లు బాకీ తేలింది. ఇవన్నీ మూడు నుంచి ఐదేళ్ల మధ్య ఇచ్చిన బాకీలే ఉన్నట్టు గుర్తించారు. వాస్తవానికి రూ.332 కోట్ల బాకీలకు సంబంధించి రుణం తీసుకున్న వ్యక్తులు డబ్బుల క్రమం తప్పకుండా చెల్లించకపోతే అధికారులు అప్రమత్తం కావాలి. తక్షణం రుణ వసూలుకు సంబంధించి ఆస్తుల వేలం వరకు వెళ్లాలి. కానీ ఇదేదీ జరగలేదు. అలాగే ఏలేశ్వరం బ్రాంచ్‌లో రూ.173 కోట్లు మొండి బాకీగా తేలింది. దీనిపై విచారణకు అడుగులు పడగా, తదుపరి విచారణ లేకుండా కొందరు అడ్డుకున్నారు. ఈ బాకీల్లో 80 శాతానికిపైగా బోగస్ రుణాలే. జగ్గంపేట బ్రాంచ్‌లో రూ.72కోట్లు, అన్నవరం రూ.45.53 కోట్లు, గోకవరం రూ.18కోట్లు, మండపేట రూ.12.29 కోట్లు చొప్పున పేరుకుపోయాయి. ఇవన్నీ దాదాపుగా గత వైసీపీ ప్రభుత్వంలో మంజూరు చేసినవే ఉన్నాయి. సాధారణంగా నిజమైన రైతులు రుణాలు తీసుకుంటే ఎంత కష్టమైనా తిరిగి చెల్లిస్తారు. ఎన్నేళ్లయినా వసూలవడం లేదంటేనే తిరకాసు ఉన్నట్టు. మరోపక్క మొండిబాకీలు ఆలమూరు బ్రాంచ్‌లో రూ.3.74 కోట్లు, అల్లవరం రూ.2.24 కోట్లు, అమలాపురం రూ.2.91 కోట్లు, అంబాజీపేట రూ.1.38 కోట్లు, అన్నవరం రూ.45.53 కోట్లు, ఆత్రేయపురం రూ.6.86 కోట్లు, దానవాయిపేట రూ.4.78 కోట్లు, ద్రాక్షారామ రూ.7.89 కోట్లు, గండేపల్లి రూ.22.56 కోట్లు, గోకవరం రూ.18.91కోట్లు, గొల్లపాలెం రూ.6.23 కోట్లు, కె.గంగవరం రూ.2.59 కోట్లు, కడియం రూ.2.94 కోట్లు, కరప రూ.3.01 కోట్లు, కాట్రేనికోన రూ.6.70 కోట్లు, కోరుకొండ రూ.8.74కోట్లు, మలికిపురం రూ.2.66 కోట్లు, మామిడికుదురు రూ.2.81 కోట్లు, మండపేట రూ.12.29 కోట్లు, ముమ్మిడివరం రూ.4.96కోట్లు, నాగమల్లితోట రూ.3.94కోట్లు, పి.గన్నవరం రూ.3.13కోట్లు, పెద్దాపురం రూ.43.97 కోట్లు, పిఠాపురం రూ.23.32 కోట్లు, రఘుదేవపురం రూ.37.97 కోట్లు, రాజమహేంద్రవరం రూ.6.48కోట్లు, రాజానగరం రూ.11.27 కోట్లు, రంపచోడవరం రూ.16.14 కోట్లు, రంగంపేట రూ.10.98 కోట్లు, రాయవరం రూ.11.40కోట్లు, సామర్లకోట రూ.5.18 కోట్లు, తుని రూ.16.18కోట్లు, యు.కొత్తపల్లి రూ.9.95 కోట్లు మొండిబాకీలుగా తేల్చారు. వీటి వసూలుకు తాజాగా 9బృందాలను ఏర్పాటుచేశారు.

రేపటి నుంచి జిల్లాలో 'టెట్'

- ఐదు కేంద్రాల్లో ఆన్‌లైన్‌లో నిర్వహణ
- ఈ నెల 21 వరకు పరీక్షలు
- హాజరుకానున్న 9,659 మంది అభ్యర్థులు
- డీఈవో రమేష్

కాకినాడరూరల్, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి): ఏపీ టెట్-2025 పరీక్షలు బుధవారం ప్రారంభం కానున్నాయని, జిల్లాలోని ఐదు కేంద్రాల్లో ఆన్‌లైన్‌లో నిర్వహిస్తామని డీఈవో పి.రమేష్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు.ఈ పరీక్షలు ఈనెల 21వరకు జరుగుతాయని, మొత్తం 9,659మంది అభ్యర్థులు హాజరుకానున్నారని అన్నారు. కాకినాడలోని ఐయాన్ డిజిటల్ జోన్, సాఫ్ట్ టెక్నాలజీ, సూరంపాలెంలోని ఆదిత్య కాలేజ్ ఆఫ్ ఇంజనీరింగ్, టెక్నాలజీ కేంద్రాల్లో ఉదయం 9.30 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు, మధ్యాహ్నం 2.30 నుంచి సాయంత్రం 5గంటల వరకు పరీక్షలు జరుగుతాయని తెలిపారు. అభ్యర్థులు తప్పనిసరిగా లేటెస్ట్ ఫొటో, గుర్తింపు కార్డుతో హాజరుకావాలన్నారు. పర్యవేక్షణకు ఐదుగురు ఎంఈవోలను, ఇద్దరు ఫ్లయింగ్ స్క్వాడ్ అధికారులను నియమించామని, నిర్వహణకు ఏర్పాట్లు పూర్తిచేశామని తెలిపారు. ఇతరవివరాలు, పరీక్షకేంద్రాల సమాచారం కోసం 9848082815, 7799698462 నెంబర్లను సంప్రదించాలని డీఈవో సూచించారు.

కలెక్టర్‌ను కలిసిన జేసీ



కలెక్టరేట్ (కాకినాడ),డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి): కలెక్టర్ షాన్‌మోహన్‌ను కొత్త జేసీ అపూర్వ భరత్ సోమవారం మర్యాదపూర్వకంగా కలిశారు. జిల్లాలో పలు అభివృద్ధి పనులపై వారు చర్చించారు.

వందేమాతరం స్ఫూర్తితోనే 'ఏక్ భారత్ శ్రేష్ఠ భారత్'

- తూర్పుగోదావరి జిల్లాలో స్వాతంత్ర్య పోరాటాన్ని లోక్‌సభలో గుర్తు చేసిన జనసేన ఎంపీ తంగెళ్ల ఉదయ్ శ్రీనివాస్

కలెక్టరేట్(కాకినాడ), డిసెంబరు 8(ఆంధ్రజ్యోతి): దేశ జాతీయ గీతం వందేమాతరం 150వ వార్షికోత్సవం సందర్భంగా పార్లమెంట్ లోక్‌సభలో జనసేన పార్టీ ఎంపీ తంగెళ్ల ఉదయ్‌శ్రీనివాస్ ప్రసంగించారు. వందేమాతరం కేవలం పదాలు, రాగం మాత్రమే కాదని, దేశ స్వాతంత్ర్య పోరాట 'ఆత్మ' అని ఉద్ఘాటించారు. బ్రిటిష్ వలస పాలనపై భారతీయుల్లో ధైర్యాన్ని, ఐక్యతను, స్వాతంత్ర్య కాంక్షను రగిల్చిన శక్తి వందే మాతరం గీతమని కొనియాడారు. స్వాతంత్ర్య పోరాటంలో ఆంధ్ర ప్రాంతం, ముఖ్యంగా తూర్పుగోదావరి జిల్లా పాత్రను ఎంపీ ప్రత్యేకంగా ప్రస్తావించారు. అహింసా ఉద్యమం రాకముందే బ్రిటిష్ వారికి వ్యతిరేకంగా సాయుధ తిరుగుబాటు చేసిన ద్వారబంధ్రాల చంద్రారావు ధైర్యసాహసాలు చిరస్మరణీయమని పేర్కొన్నారు. జాతీయోద్యమంలో మహిళలను సమీకరించి, లెక్క చేయకుండా జైలు జీవితాన్ని అనుభవించిన ధీరవనిత దువ్వూరి సుబ్బమ్మ సేవలను ఎంపీ స్మరించుకున్నారు. ఆమె స్ఫూర్తితో వేలాదిమంది మహిళలు నిరసనలు, స్వాతంత్ర్య ఉద్యమపోరాటంలో పాల్గొన్నారన్నారు. గాంధీజీ దండి మార్చ్ స్ఫూర్తితో అప్పటి తూర్పుగోదావరిలోని ఉప్పాడ, కోటిపల్లి గ్రామాల్లో ఉప్పు సత్యాగ్రహం జరిగిందన్నారు. లాఠీఛార్జీలు, నిర్బంధాలు ఎదురైనా ప్రజలు వెనకడుగు వేయలేదని, తద్వారా జాతీయ ఉద్యమంలో ఆంధ్ర తీరం గుజరాత్‌తో భుజం భుజం కలిపి నిలిచిందని ఆయన వివరించారు. ప్రధాని నొక్కి చెప్పే 'ఏక్ భారత్ శ్రేష్ఠ భారత్' ఆశయాలు వందేమాతరం ప్రతిబింబించే ఐక్యత, మాతృభూమిపై తిరుగులేని ప్రేమను మరింత దృఢం చేస్తాయని ఆయన పేర్కొన్నారు.వందేమాతరం స్ఫూర్తిని ముందుకు తీసుకువెళ్లి, భావితరాలకు దేశభక్తిని అందిస్తూ, మరింత బలోపేతమైన, సుభిక్షమైన దేశాన్ని నిర్మిద్దామని ఆయన పిలుపునిచ్చారు.

రాష్ట్రంలో 16,053 సూక్ష్మ పరిశ్రమలు

- రాజ్యసభలో ఎంపీ సానా సతీశ్‌బాబు ప్రశ్నకు కేంద్ర సూక్ష్మ చిన్న, మధ్య తరహా పరిశ్రమల శాఖ సహాయ మంత్రి సమాధానం

కలెక్టరేట్(కాకినాడ), డిసెంబరు 8(ఆంధ్రజ్యోతి): ఏపీలో ఉపాధి అవకాశాలపెంపు, గ్రామీణ పట్టణ యువత స్వయం ఉపాధి అంశాలపై ఎంపీ సానా సతీశ్‌బాబు ప్రశ్నించారు. సోమవారం ఆయన రాజ్యసభలో మాట్లాడారు. గతఐదేళ్లలో ప్రధాన మంత్రి ఉపాధి సృష్టి కార్యక్రమ అమలు వివరాలను కేంద్రాన్ని కోరారు. దీనికి స్పందించిన కేంద్ర సూక్ష్మ, చిన్న, మధ్యతరహా పరిశ్రమలశాఖ సహాయ మంత్రి సుశ్రీశోభా కరండ్లాజే మాట్లాడుతూ పీఎంఈజీపీ ఒక కేంద్ర పథకం కావడంవల్ల రాష్ట్రాల వారీగా బడ్జెట్ ఉండదన్నారు. డిమాండ్ ఆధారంగా నిధులు విడుదల చేస్తున్నామన్నారు. 2020-25 మధ్య కాలంలో ఏపీకి రూ.614కోట్లు మార్జిన్ మనీ సబ్సిడీ విడుదల చేశామన్నారు. ఈ ఐదేళ్లలో ఏపీలో 16,053 సూక్ష్మ పరిశ్రమల స్థాపన జరిగి వాటి ద్వారా 1.28 లక్షల ఉద్యోగాలు వచ్చాయన్నారు. ఈ పథకంలో గ్రామీణ ప్రాంతాలకు అధిక ప్రాధాన్యం లభించిందన్నారు. కాకినాడ జిల్లాలో 2022-23 నుంచి ఇప్పటివరకు 319 సూక్ష్మ పరిశ్రమలను పీఎంఈజీపీ కింద అందించామన్నారు. అవి తయారీ సేవల రంగాలకు సంబంధించినవని చెప్పారు.

స్క్రబ్ టైఫస్‌పై ఆందోళన చెందవద్దు

- కలెక్టర్ షాన్‌మోహన్



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ షాన్‌మోహన్

కలెక్టరేట్(కాకినాడ), డిసెంబరు 8(ఆంధ్రజ్యోతి): స్క్రబ్ టైఫస్ పురుగు కుట్టడంవల్ల వ్యాపించే వ్యాధిపై ఎవరూ ఆందోళన చెందవద్దని కలెక్టర్ షాన్‌మోహన్ పేర్కొన్నారు. సోమవారం ఆయన కలెక్టరేట్‌లో వైద్య, ఆరోగ్య శాఖ అధికారులతో సమీక్షించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఈ పురుగు కుట్టినట్టు గమనించిన వెంటనే సమీపంలోని ఆసుపత్రికి వెళ్లి చికిత్స పొందవచ్చునన్నారు. స్క్రబ్ టైఫస్ అనేది వైరస్ కాదని, ఓరింటియా సుత్సుగముషి అనే బ్యాక్టీరియా వల్ల సంక్రమిస్తుందన్నారు. ఈ బ్యాక్టీరియా సోకిన చిన్న కీటకాలు మానవులను కుట్టడం ద్వారా ఈ వ్యాధి వస్తోందన్నారు. ప్రధానంగా ఎలుకలు సంచరించే ప్రదేశాల్లోఉండే కీటకాలపట్ల జాగ్రత్తగా ఉండాలని సూచించారు. తీవ్రమైన జ్వరం,తలనొప్పి, కండరాల నొప్పులు,కీటకం కుట్టినచోట నల్లటి మచ్చ ఏర్పడడం ప్రధాన లక్షణాలన్నారు. సకాలంలో గుర్తించి చికిత్స అందించకపోతే ప్రాణాపాయం కలుగుతుందన్నారు. దీన్ని యాంటీబయోటిక్ మందులతో నయంచేయవచ్చన్నారు. దీని నివారణకు పరిశుభ్రత పాటించాలన్నారు. పొదలు, గడ్డి ఉన్న ప్రాంతాలకు వెళ్లే సమయంలో జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. ఎలుకలు ఇంట్లోకి రాకుండా చూసుకోవాలన్నారు. చికిత్స కోసం స్థానిక ఆస్పత్రులు, ఆరోగ్య కేంద్రాల్లో సంప్రదించాలన్నారు. స్క్రబ్ టైఫస్ పురుగుపై వస్తున్న వదంతులను నమ్మవద్దని సూచించారు. సమావేశంలో డీఎంహెచ్‌వో నరసింహనాయక్, జీజీహెచ్ సూపరింటెండెంట్ లావణ్యకుమారి పాల్గొన్నారు.

'విజన్ యాక్షన్ ప్లాన్ లక్ష్యాలను చేరుకోవాలి'



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ షాన్‌మోహన్

కలెక్టరేట్(కాకినాడ), డిసెంబరు 8(ఆంధ్రజ్యోతి): విజన్ యాక్షన్ ప్లాన్‌కు సంబంధించి నిర్దేశించిన కీ పెర్ఫార్మెన్స్ ఇండికేటర్స్ వివిధ శాఖలకు నిర్దేశించిన లక్ష్యానికి అనుగుణంగా అప్డేట్ కావాలని కలెక్టర్ షాన్‌మోహన్ అధికారులను ఆదేశించారు. సోమవారం ఆయన కలెక్టరేట్‌లో జిల్లా స్థాయి అధికారులతో విజన్ యాక్షన్ ప్లాన్ లక్ష్యాల పురోగతిపై సమీక్షించారు. జిల్లా, నియోజవర్గ, మం డలస్థాయిల్లో ఐదేళ్ల కార్యాచరణ ప్రణాళిక రూపకల్పనపై చర్యలు చేపట్టామన్నారు. రానున్న మూడురోజుల్లో జిల్లా స్థాయి అధికారులు ప్రత్యేక దృష్టి పెట్టి తమ శాఖలకు సంబంధించిన కీ పెర్ఫార్మెన్స్ ఇండికేటర్స్ కింద నిర్దేశించిన లక్ష్యాలను చేరుకోవాలన్నారు. జేసీ అపూర్వభరత్, ట్రైనీ కలెక్టర్ మనీషా, జిల్లా రెవెన్యూ అధికారి వెంకట్రావు ఉన్నారు.

అర్జీలను సంతృప్తికరంగా పరిష్కరించాలి

- జాయింట్ కలెక్టర్ అపూర్వ భరత్
- కలెక్టరేట్ పీజీఆర్ఎస్‌కు 482 అర్జీలు

కలెక్టరేట్(కాకినాడ),డిసెంబరు 8(ఆంధ్రజ్యోతి): ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదికలో అందిన అర్జీలకు సంతృప్తికరమైన పరిష్కారాలు అందే చర్యలు తీసుకోవాలని జాయింట్ కలెక్టర్ అపూర్వ భరత్ ఆదేశించారు. కలెక్టరేట్‌లో సోమవారం నిర్వహించిన పీజీఆర్ఎస్‌లో ఆయన 482 అర్జీలు స్వీకరించారు. ఈ సందర్భంగా జేసీ మాట్లాడుతూ అర్జీలను సకాలంలో పరిష్కరించాలన్నారు. అర్జీదారులు తమ అర్జీల స్థితిని 1100 నెంబరుకు ఫోను చేసి తెలుసుకోవచ్చన్నారు. పీజీఆర్ఎస్‌కు హాజరుకాలేని వారు మీకోసం వెబ్‌సైట్‌లో అర్జీలు నమోదు చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో ట్రైనీ కలెక్టర్ మనీషా, జిల్లా రెవెన్యూ అధికారి వెంకట్రావు, జీజీహెచ్ పరిపాలనాధికారి శ్రీధర్, కేఆర్ఆర్సీ ఎస్డీసీ రత్నమణి, సీపీవో త్రినాథ్, కలెక్టరేట్‌లోని వివిధ విభాగాల అధిపతులు పాల్గొన్నారు.



అర్జీదారుల గోడువింటున్న ఎస్పీ బిందుమాధవ్

ఎస్పీ గ్రీవెన్స్‌కు 39 అర్జీలు

కాకినాడ క్రైం, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి): వ్యక్తిగత సమస్యలతో బాధపడుతూ స్థానికంగా పరిష్కారం కాక జిల్లావ్యాప్తంగా 39మంది అర్జీదారులు సోమవారం ఎస్పీ బిందుమాధవ్ నిర్వహించిన పోలీస్ గ్రీవెన్స్‌ను ఆశ్రయించారు. 11 భూ తగాదాలు, 11 కుటుంబ కలహాలు, 17 వివిధ కేసులకు సంబంధించిన ఫిర్యాదులు ఉన్నాయి. అర్జీదారుల సమక్షంలోనే ఎస్పీ సంబంధిత పోలీసు అధికారులతో వీడియో సమావేశం నిర్వహించి ఫిర్యాదులు సమ్మతమైనవైతే వెంటనే ఎఫ్ఐఆర్ నమోదు చేసి వేగంగా దర్యాప్తు పూర్తిచేసి సమస్య పరిష్కారానికి చర్యలు చేపట్టాలని ఆదేశించారు.



పింఛను ఇప్పించండి!




అతికష్టం మీద కాకినాడ కలెక్టరేట్‌కు వస్తున్న ఈమె పేరు కొల్లుబోయిన మంగ. పిఠాపురం మండలం చిత్రాడలోని గొల్లవీధి ఓ ప్రమాదంవల్ల 2023లో ఈమె ఎడమకాలువను వైద్యులు తొలగించారు. దీంతో జీవనం కష్టంగా మారింది. ప్రభుత్వం రూ.6000 పింఛను మంజూరు చేసింది. భర్త రోజూ పనికి వెళ్తే కానీ పూట గడవట్లేదు. కుటుంబపోషణ కష్టంగా ఉంటుంది. తనకు సదరం సర్టిఫికెట్ 90శాతం ఉంది. రూ.10,000 పింఛను ఇప్పించాలని సోమవారం కాకినాడ కలెక్టరేట్‌లో పీజీఆర్ఎస్‌కు వచ్చి ఆమె అధికారులకు విన్నవించింది.

- స్టాఫ్ ఫొటోగ్రాఫర్, కాకినాడ





ఎంతో మంది కలలుకనే విద్యా ప్రపంచం అది.
ఎందరినో ఉన్నత విద్యావంతులుగా తీర్చిదిద్దిన ఆలయం అది.
ఒక్కసారి సీటు వస్తే చాలు విద్యార్థి భవిష్యత్తుకు
ఢోకా ఉండదని భరోసా ఇచ్చే పాఠశాల.
ఉన్నత ప్రమాణాలను అనుసరిస్తూ ఉత్తమ విలువలతో
విద్యా బోధనతో పాటు విద్యార్థులను
అన్ని రంగాల్లో తీర్చిదిద్దే బడి...
అదే జవహర్ నవోదయ విద్యాలయ.





ఇక్కడ చదివితే నవోదయమే

- సీటు సాధిస్తే ఉజ్వల భవిష్యత్తు
- అత్యుత్తమ ప్రమాణాలతో విద్యా బోధన
- పేద, మధ్య తరగతి విద్యార్థులకు గొప్ప అవకాశం
- ఆరో తరగతిలో ప్రవేశానికి ఈ నెల 13న పరీక్ష

(పెద్దాపురం-ఆంధ్రజ్యోతి)

● కాకినాడ జిల్లా పెద్దాపురం పట్టణంలో నవోదయ పాఠశాలను 1988లో కేంద్ర ప్రభుత్వం ప్రారంభించింది.

● ఇక్కడ ఆరో తరగతి నుంచి ఇంటర్ వరకు ఉచిత విద్య అందిస్తారు. కార్పొరేట్ పాఠశాల స్థాయి వసతుల మధ్య నిపుణులైన ఉపాధ్యాయులు బోధిస్తారు. క్రీడలు, సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహిస్తారు. కేంద్ర ప్రభుత్వ పరిధిలోని ఈ పాఠశాలలో ఇంటర్ ఎంబైపీసీ చదివే అవకాశం ఉంది.

● బాలబాలికలకు వసతిగృహాలు, భోజనం, విద్య, నోట్ బుక్స్, యూనిఫామ్, షూస్, టాయిలెట్ సామగ్రి ఉచితం.

● శాస్త్ర సాంకేతికతో కూడిన విద్య, క్రీడలు, యోగా ద్వారా విద్యార్థికి సంపూర్ణ వ్యక్తిత్వవికాసం కల్పిస్తారు.

● కంప్యూటర్ కోర్సులతో పాటు సంగీతం, డ్రాయింగ్, క్రాఫ్ట్, నృత్యం వంటి వాటిల్లో శిక్షణ ఇస్తారు.

● ఇక్కడ త్రిభాషా సూత్రం అమలుచేస్తారు. తెలుగు, ఆంగ్లం, హిందీ భాషలపై విద్యార్థులకు పట్టు లభిస్తుంది. వీటిలో చేరేందుకు పోటీ ఎక్కువగా ఉంటుంది.

● విద్యార్థుల్లో క్రమశిక్షణ, నాయకత్వ లక్షణాలు, దేశభక్తిని పెంపొందించేందుకు ఎన్‌సీసీ శిక్షణ ఇస్తారు. సమ యపాలన, నిబద్ధత, నైతిక విలువలు నేర్పిస్తారు. ప్రాథమిక సైనిక శిక్షణ, మ్యాప్ రీడింగ్, కమ్యూనికేషన్, ఫైరింగ్ అంశాలు ఉంటాయి. సామాజిక సేవా కార్యక్రమాలు, సాహస కార్యకలాపాలైన పెరేడ్లు, ర్యాలీలు, సాహస శిక్షణ, టీమ్ లీడింగ్, సమయపాలన అభివృద్ధి చేస్తారు.

జవహర్ నవోదయ విద్యాలయలో ఆరో తరగతిలో ప్రవేశానికి ఈ నెల 13న ప్రవేశ పరీక్ష నిర్వహించనున్నారు. ఇందుకు ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లావ్యాప్తంగా 7,170 మంది దరఖాస్తు చేసుకున్నారు. పరీక్ష నిర్వహణకు 32 కేంద్రాలు కేటాయించారు. ప్రశ్నపత్రం ఎలా ఉంటుంది.... పరీక్ష రాసేటప్పుడు తీసుకోవాల్సిన జాగ్రత్తలు మీకోసం...

మూడు విభాగాల్లో పరీక్ష...

ప్రవేశ పరీక్ష సమయం రెండు గంటలు. వంద మార్కులకు వంద ప్రశ్నలు మూడు విభాగాల్లో ఉంటాయి. ప్రతి విభాగంనూ ఐచ్ఛిక ప్రశ్నలు ఉంటాయి. ఒక్కో ప్రశ్నకు ఒక్కో మార్కు. రీజనింగ్ (మేథాశక్తి)లో 50 మార్కులకు 40 ప్రశ్నలు, తెలుగు భాష పరీక్షలో ఐదు అంశాల్లో ఒక్కో అంశానికి నాలుగు మార్కులు చొప్పున 25 మార్కులు ఉంటాయి. ఇంగ్లిషు, తెలుగు మీడియం విద్యార్థులకు వేర్వేరు ప్రశ్నపత్రాలు ఇస్తారు.

ఎక్కువ మార్కులు ఏ విభాగంలో అంటే..

మేథాశక్తి విభాగంలో 40 ప్రశ్నలు ఇస్తారు. ఒక్కో ప్రశ్నకు 1.25 మార్కులు చొప్పున మొత్తం 50 మార్కులు ఉంటాయి. విద్యార్థుల్లోని మేథాశక్తిని వెలికితీసేలా ఇవి ఉంటాయి. బొమ్మలతో కూడిన ప్రశ్నలు ఉంటాయి. ప్రశ్న కింద నాలుగు సమాధానాలు బొమ్మల రూపంలో ఉంటాయి. ఈ ప్రక్రియలో సులభంగా మార్కులు పొందడానికి విద్యార్థులు సమయస్ఫూర్తితో ఆలోచించాల్సి ఉంటుంది. బొమ్మలను జాగ్రత్తగా గమనిస్తే తక్కువ సమయంలోనే సమాధానాలు గుర్తించవచ్చు. నవోదయ దరఖాస్తుతో పాటు పంపిణీ చేసిన సమాచారంలో ప్రతి విభాగానికి చెందిన నమూనా ఉంటుంది. దీన్ని పరిశీలించి



శ్రద్ధగా అభ్యాసం చేస్తే ఈ విభాగంలో సులువుగా 45 మార్కులు పొందే అవకాశం ఉంది.

గణితంలో ఇలా...

గణిత విభాగంలో 20 ప్రశ్నలు ఉంటాయి. ఒక్కో ప్రశ్నకు 1.25 మార్కుల వంతున 25 మార్కులు ఉంటాయి. ఐదో తరగతి వరకు గల అన్ని చాప్టర్లలో ఒకటి లేదా రెండు చొప్పున ప్రశ్నలు అడుగుతారు. గణితంలో అధిక మార్కులు సంపాదించగలిగే విద్యార్థులు దాదాపుగా నవోదయలో సీటు పొందుతారు. సులభంగా మార్కులు సాధించేందుకు ప్రధాన గణిత సూత్రాలు నేర్చుకోవాలి. అంతేకాక 5 అంశాల ఆధారంగానే 25 ప్రశ్నలు ఉంటాయి.

భాషా పరీక్ష ఇలా..

విద్యార్థుల భాషా పఠనాసక్తిని అంచనా వేసేందుకు ఈ పరీక్ష నిర్వహిస్తారు. ఈ ప్రశ్నలు 25 మార్కులకు ఉంటాయి. ఈ విభాగంలో ఐదు పాఠ్యాంశాలు ఇస్తారు. ఒక్కో పాఠ్యాంశంలో నాలుగు ప్రశ్నల వంతున ఐదు పాఠ్యాంశాల్లో 25 మార్కులు ఉంటాయి. పాఠ్యాంశాల ఆధారంగా ఇచ్చే ప్రశ్నలకు సమాధానాలు అన్నీ ఒకేలా ఉంటాయి. నిశితంగా గమనిస్తే సమాధానం కచ్చితంగా గుర్తించేందుకు వీలవుతుంది.

ఉన్నత ప్రమాణాలతో ..

ఆరో తరగతిలో చేరేందుకు 80 సీట్లు అందుబాటులో ఉన్నాయి. వాటిలో 75 శాతం గ్రామీణ ప్రాంతం వారికి, 25 శాతం నగరవాసులకు కేటాయించారు. ప్రవేశ పరీక్షలో ప్రతిభ చూపి సీటు సాధిస్తే వారి భవిష్యత్తు ఎంతో ఉజ్వలంగా ఉంటుంది. ఉన్నత ప్రమాణాలతో విద్యా బోధనతో పాటు క్రీడలపై ప్రత్యేక దృష్టి, కార్పొరేట్ స్థాయి వసతులు ఉంటాయి.

ఏర్పాట్లు పూర్తి చేశాం



ఉమ్మడి జిల్లాలోని 32 కేంద్రాల్లో ఈ నెల 13న నవోదయ ప్రవేశ పరీక్ష నిర్వహించేం దుకు అన్ని ఏర్పాట్లు చేశాం. మాస్ కాపీ యింగ్‌ను నిరోధించేందుకు సిట్టింగ్ స్క్వాడ్‌లను నియమిస్తున్నాం. ఎంఈవోల ఆధ్వర్యంలో ప్రశాంతంగా పరీక్ష నిర్వహించేందుకు జాగ్రత్తలు తీసుకుంటున్నాం.

బి.సీతాలక్ష్మి, ప్రిన్సిపల్

ఈ సూచనలు పాటించండి...

● పరీక్షకు వెళ్లేటప్పుడు హాల్ టికెట్, ప్యాడ్, నీలం, నలుపు రంగు పెన్నులు తీసుకువెళ్లాలి.

● ప్రశ్నపత్రంలో అన్ని పేజీలు ప్రింట్, క్రమ సంఖ్య, మీడియం సరిగా ఉన్నాయో లేదో చూసుకోవాలి.

● పరీక్ష కేంద్రానికి అరగంట ముందు వెళ్లాలి.

● జవాబు పత్రాన్ని ఒకటికి రెండుసార్లు జాగ్రత్తగా గమనించాలి. పేరు, హాల్ టికెట్ నెంబరు రాయాలి.

● జవాబు పత్రంలో ఎంచుకున్న సంఖ్యను బాక్సులో మధ్యలో సరిగా కనిపించేలా రాయాలి.

● జవాబు పత్రంలో కొట్టివేతలు, దిద్దుబాట్లు ఉండకూడదు.

● ప్రతి విభాగంలోనూ కచ్చితంగా ఉత్తీర్ణులు కావాలి.

రాజమహేంద్రవరం నాకు సెకండ్ హోమ్

- గోదావరి జిల్లాల ప్రజల ఆదరణ, ఆప్యాయత మరువలేనివి
- 350కి పైగా సినిమాల్లో నటించా
- నాకు ప్రేరణ విజయనిర్మల
- 'ఆంధ్రజ్యోతి'తో సహజ నటి జయసుధ



గోదావరి జిల్లాల ప్రజలు చూపించే ఆప్యాయత, ఆదరణ ఎనలేనివి... రాజమహేంద్రవరం నాకు సెకండ్ హోమ్ లాంటిది... అన్నారు సహజ నటి జయసుధ. క్రిస్మస్ వేడుకల్లో పాల్గొనేందుకు తూర్పు గోదావరి జిల్లా రాజమహేంద్రవరం వచ్చిన ఆమె సోమవారం మాజీ ఎంపీ జీవీ హర్ష కుమార్ నివాసానికి విచ్చేశారు. ఈ సందర్భంగా ఆమె కొద్దిసేపు 'ఆంధ్రజ్యోతి'తో ముచ్చటించారు.

గోదావరి జిల్లాలతో మీ అనుబంధం?

1975-80 మధ్యలో గోదావరి జిల్లాల్లో షూటింగ్‌లకు వస్తే ఉండేందుకు సరైన హోటల్ సదుపాయం ఉండేది కాదు. కానీ గోదావరి జిల్లాల ప్రజలు మమ్మల్ని వారి సొంత కుటుంబసభ్యుల్లా చూసుకునేవారు. వారి ఆప్యాయత మరువలేము.

మీ సొంత ఊరు?

మా నాన్నగారిది తిరుపతి. అమ్మమ్మగారిది విజయనగరం. అయితే నాకు రాజమహేంద్రవరం సెకండ్ హోమ్ లాంటిది. ఇక్కడి ప్రజలు చాలా ప్రేమగా, గౌరవంగా చూసుకునేవారు. ఆ రోజులు వేరు. అవి గోల్డెన్ డేస్. నాకు కోస్తా ప్రాంతంలో ఫ్యాన్ ఫాలోయింగ్ వుంది.

సినీ పరిశ్రమలో నాటికీ, నేటికీ వచ్చిన మార్పులు?

చాలా ఆధునిక పరిజ్ఞానం వచ్చింది. అనేక మార్పులు వచ్చాయి. ఎంతో మందికి అవకాశాలు వస్తున్నాయి. కొత్త నటీనటులు వస్తున్నారు. బాగా చేస్తున్నారు. ఓటీటీ రంగ ప్రవేశం చేసింది.

మీరు ఇప్పటివరకు ఎన్ని సినిమాలు చేశారు?

350కు పైగా సినిమాలు చేశాను. అనేక పాత్రలు సంతృప్తి ఇచ్చాయి. కుటుంబ కథా చిత్రాలు బాగా పేరుతెచ్చాయి. నాడు అగ్రనటులతో నటించాను. నేటి అగ్రనటులకు తల్లి పాత్రలు పోషించాను. 25ఏళ్ల తర్వాత మలయాళం సినిమా చేస్తున్నాను. ఏ రోల్‌పడితే అది చేయను.

ప్రస్తుతం రాజకీయాలపై ఇంట్రస్ట్ వుందా?

గతంలో నేను తెలంగాణలో కాంగ్రెస్ తరపున ఎమ్మెల్యేగా చేశాను. ప్రస్తుతం ఏ పార్టీలోనూ లేను. ఈ వయసులో రాజకీయాలకు సూట్ అవుతానా లేదో చూడాలి. ప్రస్తుతానికి ఆ ఆలోచన లేదు. రోల్ అనేది ముఖ్యం. అది ప్రామిస్ చెయ్యలేకపోయినప్పుడు ఉండలేము. రోజూ పని అనేది ఉండాలి. స్మృతిఇరానీలాంటి వారిని స్ఫూర్తిగా తీసుకోవాలి.

మీరు సినీ రంగంలోకి రావడానికి ప్రేరణ?

ఇది చిన్నప్పటి విషయం. గూగుల్‌లో కూడా తప్పులు ఉన్నాయి. నేను 12వ ఏట సినీ పరిశ్రమలోకి వచ్చాను. మా ఆంటీ విజయ నిర్మల గారు నన్ను తీసుకువచ్చారు. ఆమె నాకు ప్రేరణ. ఎన్నో సినిమాలు చేశాను. ఆనందంగా ఉంది.

రాజమహేంద్రవరం సిటీ (ఆంధ్రజ్యోతి)

అమ్మ .. అనే పిలుపులో ఎంతో మాధుర్యం

- దేశంలో ఉన్నత స్థానంలో ఉన్నవారంతా మాతృభాషలో చదివిన వారే
- మాజీ ఉపరాష్ట్రపతి వెంకయ్యనాయుడు

దివాన్‌చెరువు, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి) : మమ్మీ, డాడీ అనే పిలుపు మంచిది కాదు.. అమ్మ అనే పిలుపులో ఉన్న మాధుర్యం మమ్మీలో ఉండదని మాజీ ఉపరాష్ట్రపతి ముప్పవరపు వెంకయ్యనాయుడు అన్నారు. ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయం, న్యూఢిల్లీకి చెందిన భారతీయ భాషాసమితి సంయుక్త ఆధ్వర్యంలో 'భారతీయ భాషల్లో ఏకరూప శాస్త్రీయ సాంకేతిక పదజాలం' అనే అంశంపై రెండు రోజులపాటు జరిగే కార్యశాలను వెంకయ్యనాయుడు సోమవారం జ్యోతి వెలిగించి ప్రారంభించారు. ఉపకులపతి ఆచార్య ఎస్.ప్రసన్నశ్రీ అధ్యక్షత వహించిన ఈ సభలో వెంకయ్యనాయుడు ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. మమ్మీ అనేది పెదవుల నుంచి వస్తుందని, అమ్మ అన్న పిలుపు మన అంతరాళం నుంచి వస్తుందన్నారు. కావాలంటే ఇంటికి వెళ్లాక పరిశీలించుకోవాలని చెప్పారు. ఇంగ్లీషు వారి పాలనలో బలవంతంగా మన మీద ఇంగ్లీషు రుద్దడమే కాకుండా, ఇంగ్లీషులో మాట్లాడితేనే ఉద్యోగం ఇస్తామని చెప్పడంతో తప్పనిసరి పరిస్థితుల్లో ఇంగ్లీషు నేర్చుకోవలసి వచ్చిందని చెప్పారు. మనం కూడా మాతృభాషలో



సమావేశంలో మాట్లాడుతున్న వెంకయ్యనాయుడు

చదివితేనే ఉద్యోగం అనే విధంగా ఉండాలన్నారు. మాతృభాషలో మాట్లాడడం అందరూ అలవరచుకోవాలన్నారు. ప్రధాని మోదీ గుజరాతీ భాషలోనూ,రాష్ట్రపతి ద్రౌపదిముర్ము తన మాతృభాష ఒడియాలోనే చదివారని, సుప్రీంకోర్టు పూర్వ ప్రధానన్యాయమూర్తి ఎన్వీ రమణ, తాను మాతృభాష తెలుగులో చదువుకున్నామని చెప్పారు. దేశంలో ఉన్నతస్థానాల్లో ఉన్నవారంతా మాతృభాషలో చదువుకున్నారని ఆయన స్పష్టంచేశారు. ప్రాథమిక విద్య, పరిపాలనా భాష మాతృభాషే కావాలని.. న్యాయస్థానాల్లో వాదప్రతివాదనలు, తీర్పులు కూడా మాతృభాషలోనే జరగాలన్నారు. తిట్టు కూడా తెలుగులో ఎంతో బాగుంటుందన్నారు. మన భాష, యన యాస, మనపాట, మన ఆట, మన గోస కాపాడుకోవాలని అన్నారు. నన్నయ వీసీ ఆచార్య ప్రసన్నశ్రీ మాట్లాడుతూ భాష ఒక నిత్యప్రవాహిని, ఒక జీవనది, తరాల తోపాటుగా కాలానుగుణంగా అవసరాలకు తగినట్టుగా మారుతూ ముందుకు సాగుతూ ఉంటుందన్నారు. భాషను విభిన్న



కార్యక్రమంలో విద్యార్థుల నృత్యాలు

శాస్త్ర, సాంకేతిక రంగాల్లో వాడకానికి అనువుగా మలుచుకోవడానికి, నూతనపదజాల సృష్టికి ఒక ప్రణాళికను తయారు చేసుకోవడం శ్రేయోదాయకమన్నారు. ఈ సందర్భంగా విశ్రాంత డీఎస్పీ, సైకాలజిస్ట్ నామగిరి బాబ్జీ రచించిన హేండ్ బుక్ ఆఫ్ డ్రగ్ ఎడిక్షన్ అండ్‌ది రోల్ ఆఫ్ ఎన్ఫోర్స్‌మెంట్ పుస్తకాన్ని, నన్నయ విశ్వవిద్యాలయం సోషల్ వర్క్ సహాయాచార్యుడు మల్లిబాస్కర్ రచించిన మస్తాన్‌బాబు జీవనచిత్రం శిఖరాగ్రి మల్లి పుస్తకాన్ని, నర్సరీ రైతు పుల్లా సత్యనారాయణ రచించిన ధరణీపుత్రులు పుస్తకాలను వెంకయ్యనాయుడు ఆవిష్కరించారు. తొలుత నన్నయ ప్రాంగణంలోని ఎన్టీఆర్ కన్వెన్షన్ భవనం వద్ద వీసీ ప్రసన్నశ్రీ ఆధ్వర్యంలో పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. సభానంతరం వెంకయ్యనాయుడును సత్కరించి జ్ఞాపిక అందజేశారు. నన్నయ తెలుగుశాఖసహాయాచార్యుడు కేవీఎన్‌డీ వరప్రసాద్ స్వాగతం పలుకగా, జాతీయ కార్యశాల కోఆర్డినేటర్ తలారి వాసు కార్యశాల ఉద్దేశం వివరించారు. తెలుగు- సంస్కృత అకాడమి అధ్యక్షుడు ఆర్.డి.విల్సన్ (శరత్‌చంద్ర) మాట్లాడుతూ వైజ్ఞానిక, విజ్ఞానం ప్రతిబింబేవిధంగా మ్యాగజైన్‌లు, మాజీ ఉపరాష్ట్రపతి వెంకయ్యనాయుడు వంటి ప్రముఖుల మోనోగ్రాఫ్ పుస్తకాలు తీసుకురాబోతున్నామని చెప్పారు. కార్యక్రమంలో తానా పూర్వాధ్యక్షుడు తోటకూర ప్రసాద్, భారతీయభాషా సమితి అకడమిక్స్ కోఆర్డినేటర్ కె.గిరిధరరావు, తదితరులు పాల్గొన్నారు.

సింహాచల క్షేత్రానికి సంపెంగ మొక్కలు

కడియం, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి): సింహాచలం వరాహ లక్ష్మీ నరసింహ దేవస్థానానికి కడియపులంకకు చెందిన దుర్గా నర్సరీ అధినేత పెద్దిరెడ్డి శ్రీనివాస్ సోమవారం ఉచితంగా సంపెంగ మొక్కలు పంపించారు. గతంలో కూడా శ్రీనివాస్ సంపెంగ మొక్కలు అందజేశారు. అలాగే హుద్‌హుద్ తుఫాన్ సమయంలో నేలకొరిగిన సంపంగి చెట్ల స్థానంలో వీటిని మళ్లీ నాటనున్నట్టు దేవస్థానం సూపరింటెండెంట్ హరికృష్ణ తెలిపారు. కార్యక్రమంలో గంగుల సత్యనారాయణ, గెడ్డం ఆది నారాయణ, పెద్దిరెడ్డి శ్రీను, చల్లా దుర్గారావు, బాదం పెదకాపు, తదితరులు పాల్గొన్నారు.



లారీలో మొక్కలు పంపుతున్న రైతు శ్రీనివాస్

'భట్నవిల్లి'లో లక్ష్మీ హ్యుందాయ్ భారీ షోరూమ్

- జ్యోతిప్రజ్వలన చేసిన రాష్ట్ర మంత్రి వాసంశెట్టి సుభాష్



షోరూంను ప్రారంభిస్తున్న మంత్రి సుభాష్ , చిత్రంలో సంస్థ చైర్మన్ కంభంపాటి , కిమ్స్ చైర్మన్ చైతన్యరాజు

అమలాపురం, డిసెంబరు 8(ఆంధ్రజ్యోతి): అమలాపురం రూరల్ మండలం భట్నవిల్లి జంక్షన్ సమీపంలో ఏర్పాటైన లక్ష్మీ హ్యుందాయ్ భారీ షోరూమ్‌ను సోమవారం రాష్ట్ర మంత్రి వాసంశెట్టి సుభాష్ ప్రారంభించారు. వివిధ రాజకీయ పార్టీలకు చెందిన అతిథులు, పట్టణ ప్రముఖులు హాజరయ్యారు. తొలుత మంత్రికి స్వాగతం పలికారు. కార్యక్రమంలో లక్ష్మీ హ్యుందాయ్ చైర్మన్ కంభంపాటి రామ్మోహనరావు, మాజీ ఎమ్మెల్సీ, కిమ్స్ చైర్మన్ కేవీవీ సత్యనారాయణరాజు (చైతన్యరాజు) అముడా చైర్మన్ అల్లాడ స్వామినాయుడు, టీడీపీ రాష్ట్ర ఆర్గనైజింగ్ కార్యదర్శి మెట్ల రమణబాబు, డీటీవో దేవిశెట్టి శ్రీనివాస్, బీజేపీ కిసాన్ జాతీయ నాయకుడు నల్లా పవన్‌కుమార్, మున్సిపల్ మాజీచైర్మన్ చిక్కాల గణేష్, ఎం.గోపాలకృష్ణరాజు, పెన్మెత్స జగ్గప్పరాజు, వైసీపీ నేత పీకే రావుతో పాటు పలువురు టీడీపీ, జనసేన, బీజేపీకి చెందిన నాయకులు పాల్గొన్నారు. లక్ష్మీ హ్యుందాయ్ గ్రూపు రాజమహేంద్రవరం ఆపరేషన్స్ హెడ్ సునీల్‌కుమార్, సేల్స్ మేనేజర్ సత్యమూర్తితో పాటు పట్టణంలోని టీడీపీ, జనసేన, బీజేపీ, వైసీపీకి చెందిన రాజకీయ నాయకులు కార్యక్రమంలో పాల్గొన్నారు. ఎన్నో అత్యాధునిక సౌకర్యాలతో ఈ షోరూంను ప్రారంభించడం జరిగిందని కస్టమర్లకు అత్యంత విలువైన సౌకర్యాలను ఈ షోరూమ్ ద్వారా అందించడం జరుగుతుందని చైర్మన్ కంభంపాటి తెలిపారు. సేల్స్, సర్వీస్, బాడీ షాప్, యాక్సరీస్, స్పేర్ పార్ట్స్ వంటి అన్నిరకాల సేవలు కోనసీమ జిల్లా షోరూంలో అందుబాటులోకి తీసుకు వచ్చినట్టు తెలిపారు ఈ ప్రారంభోత్సవ కార్యక్రమంలో పాల్గొన్న మంత్రితో పాటు ఇతర నేతలందరికీ ఆపరేషన్ హెడ్ సునీల్‌కుమార్ కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో నల్లా శ్రీధర్, ఆర్డీఎస్ ప్రసాద్, తదితరులు పాల్గొన్నారు.

పర్యాటక సౌరభం .. గోదావరి తీరం

- ప్రముఖ రచయిత, నటుడు ఎల్‌బీ శ్రీరామ్



షూటింగ్‌లో పాల్గొన్న ఎల్‌బీ శ్రీరామ్

ధవళేశ్వరం, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి): గోదావరి తీరం సహజసిద్ధమైన ప్రకృతి అందాలకు నిలయమని ప్రముఖ రచయిత, సినీ నటుడు ఎల్‌బీ శ్రీరామ్ పేర్కొన్నారు. సోమవారం ధవళేశ్వరంలోని రామపాదాలరేవు సమీపం గోదావరి నది ఒడ్డున జరిగిన టెలీ షూటింగ్‌లో పాల్గొన్నారు. ఇందులో ఈయన ప్రధాన పాత్ర పోషిస్తున్నారు. ఈ సందర్భంగా ఈనెల 15న కడియంలో జరిగే రాష్ట్రస్థాయి సాహిత్య కార్యక్రమానికి రావాలని కోరుతూ కడియం ఎంపీపీ వెలుగుబంటి వెంకట సత్యప్రసాద్, చల్లపిళ్ల కమిటీ ప్రధాన కార్యదర్శి చిలుకూరి శ్రీనివాసరావు ఆహ్వానించారు.

కోటి తలంబ్రాల పంటకు వానర హారతి

- గోకవరం మండలం అచ్యుతాపురంలో నిర్వహణ
- గోటి కోటి తలంబ్రాలకు ధాన్యం సిద్ధం

గోకవరం, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి) : శ్రీరామతత్వాన్ని ప్రచారం చేయడంలో భాగంగా గోకవరం మండలం అచ్యుతాపురంలో సోమవారం 15వ కోటి తలంబ్రాల జ్ఞానయజ్ఞాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా కోటి తలంబ్రాలకు వానరహారతి అనే కార్యక్రమాన్ని ప్రారంభించారు. శ్రీరామతత్వాన్ని ప్రచారం చేస్తున్న కోరుకొండ శ్రీకృష్ణ చైతన్య సంఘం అధ్యక్షుడు కల్యాణం అప్పారావు ఆధ్వర్యంలో ఈ జ్ఞానయజ్ఞం కొనసాగుతోంది. విత్తనం నుంచి తలంబ్రాల వరకు అంతా రామమయం అనే సద్భావంతో తొలుత విత్తనాలకు భద్రాచలం శ్రీసీతారామస్వామి దేవస్థానంలో పూజలు చేయించిన అనంతరం అక్కడ నుంచి అచ్చు తాపురం తీసికొచ్చి కల్యాణం చక్రవేణి పొలంలో చల్లడం జరిగింది. క్రమంలో పండిన పంటకు వానర హారతి చేపట్టారు. అనంతరం రామభక్తులు వానరవేషంలో(రాముడు, సీత, ఆంజనేయుడు, సుగ్రీవుడు, జాంబవంతుడు, అంగదుడు) పంటను కోసి కుప్పవేసి సీతరామ అష్టోత్తర శతనామస్తోత్రం, హనుమాన్ చాలీషా పారాయణం చేశారు. కోటి తలంబ్రాల కోసం సేకరించిన ధాన్యాన్ని 5 రాష్ట్రాలలో 5 వేల మందిచే గోటితో ఒలిపించి కోటి తలంబ్రాలను సిద్ధం చేయనున్నట్టు అప్పారావు తెలిపారు. 15వ సారి భద్రాచలం, 8వ సారి ఒంటిమిట్ట, 4వ సారి అయోధ్యకు గోటి కోటి తలంబ్రాలను పంపడంలో భాగంగా కార్యక్రమం నిర్వహించబడుతుందని ఆయన వివరించారు.



అచ్యుతాపురంలో ధాన్యం సిద్ధం చేస్తున్న వానర వేషధారులు



మెడికల్ కళాశాలల ప్రైవేటీకరణను అడ్డుకునేందుకే కోటి సంతకాల సేకరణ : బొత్స

రావులపాలెం, డిసెంబరు 8(ఆంధ్రజ్యోతి): పేద విద్యార్థులు ఉన్నత చదువులు చదువుకోవాలనే సంకల్పంతో వైసీపీ పాలనలో ఏర్పాటు చేసిన ప్రభుత్వ మెడికల్ కళాశాలలను కూటమి ప్రభుత్వం ప్రైవేటీకరణ చేయాలని చూస్తున్నదని, దాన్ని అడ్డుకోవడానికే కోటి సంతకాల సేకరణ చేపట్టామని వైసీపీ రీజనల్ కోఆర్డినేటర్ బొత్స సత్యనారాయణ అన్నారు. సోమవారం అంబేడ్కర్ కోనసీమ జిల్లాలోని రావులపాలెం సీఆర్సీ మీటింగ్ హాలులో వైసీపీ జిల్లా అధ్యక్షుడు చిర్ల జగ్గిరెడ్డి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు.



విలేకరులతో మాట్లాడుతున్న మాజీమంత్రి బొత్స

తాడువాయి... మరో మాట లేదోయ్!




పోలవరం నిర్వాసితులకు పునరావాసం కేంద్రం అక్కడే..
వెళ్లడం ఇష్టంలేనివారి గురించి తర్వాత ఆలోచిస్తాం
ఐటీడీఏ పీవో మాటలు..
నిర్వాసితుల్లో రేగిన గుబులు

ఇటీవల కోయలగూడెంలో భూములు సందర్శించడానికి వెళ్లిన నిర్వాసితులు

కూనవరం, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి): ప్రస్తుతానికి గిరిజనేతరుల పోలవరం నిర్వాసితులకు మరో ప్రత్యామ్నాయం లేదు. మీకు ఏలూరు జిల్లా తాడువాయిలోనే పునరావాసం.. ఒకవేళ కొంతమందికి అక్కడికి వెళ్లడం ఇష్టం లేకపోతే వారి గురించి తర్వాత ఆలోచిస్తాం.. అంటూ సాక్షాత్తూ చింతూరు ఐటీడీఏ పీవో, ఆర్‌అండ్‌ఆర్ ప్రత్యేకాధికారి శుభం నోక్వాల్ ఇటీవల తహశీల్దార్ కార్యాలయంలో జరిగిన సమావేశంలో తేల్చిచెప్పడంతో నిర్వాసితులకు గుబులు రేగింది. అల్లూరి జిల్లా కూనవరం మండలంలో 9 ప్రాధాన్య గ్రామాలను గుర్తించి ప్రభుత్వం పోలవరం పరిహారం ఇవ్వడానికి ముందుకొచ్చింది. ఇప్పటికే ఆ గ్రామాలకు ఇళ్లకు సంబంధించిన పరిహారం బ్యాంకు ఖాతాలో జమవుతుంది. అయితే 7 గ్రామాలకు పునరావాస ప్రక్రియ సజావుగా సాగుతున్నా కూనవరం, టేకులబోరు గ్రామాల్లో అధికారుల తప్పిదం కారణంగా చిక్కుముడి ఏర్పడింది. ఈ గ్రామాల ప్రజలకు మొదటిగా తాడువాయి పునరావాస కేంద్రమంటూ కొంతమందిని బస్సుల్లో తీసుకెళ్లి చూపించారు. కొంతమంది అంగీకారం తెలపగా మరికొంతమంది వ్యతిరేకించారు. కొంతకాలం తర్వాత వ్యతిరేకించిన వారికి కోయిలగూడెం గ్రామాన్ని చూపించారు. దీంతో మిగతావారు ఆ గ్రామానికి అంగీకారమంటూ అధికారులకు చెప్పారు. ఇప్పుడు కోయిలగూడెం గ్రామం పునరావాస కేంద్ర జాబితాలోలేదని కేవలం తాడువాయి మాత్రమే పునరావాస కేంద్రమని మండలంలో ప్రతీ ఒక్కరూ తాడువాయి గ్రామాన్నే ఎంచుకోవాలని అధికారులు చెప్పడంతో నిర్వాసితులు కంగుతిన్నారు. తమను బస్సుల్లో తీసుకెళ్లి కోయిలగూడెం గ్రామాన్ని ఎందుకు చూపించారని అక్కడ పునరావాసం కల్పిస్తామంటూ అధికారులు చెప్పిన మాట వాస్తవం కాదా అప్పుడు జాబితాలో ఉన్న గ్రామం ఇప్పుడు ఎందుకు లేదని నిర్వాసితులు ప్రశ్నిస్తున్నారు. అయితే పొరపాటు జరిగిందని, కోయిలగూడెంలో పునరావాసం కల్పించలేమని సాక్షాత్తు ఐటీడీఏ పీవో ఇటీవల జరిగిన సమావేశంలో తేల్చిచెప్పారు. అయితే ఇక్కడ నిర్వాసితులకు తాడువాయిలోనే పునరావాసం కల్పిస్తామని మరెక్కడా ప్రస్తుతానికి పునరావాసం లేదని పీవో చెప్పారు. ప్రత్యామ్నాయం వెతుక్కునే వారి గురించి తర్వాత ఆలోచిస్తామన్నారు. దీంతో కొంతమంది గత్యంతరం లేక తాడువాయినే పునరావాస కేంద్రంగా ఎంచుకుంటున్నారు.

పీవో సీసీతో సమావేశం ఏంటి?

తహశీల్దార్ కార్యాలయంలో ఆదివారం జరిగిన నిర్వాసితుల సమావేశానికి ఐటీడీఏ పీవో రాకుండా ఆయన సీసీ సమావేశం నిర్వహించడంతో నిర్వాసితుల నుంచి విమర్శలు వస్తున్నాయి. జీవనమరణ సమస్యలు వంటి పరిహారం విషయంలో జవాబుతనం లేని అధికారులను పంపించడం ఏంటని నిర్వాసితులు అంటున్నారు. ఐటీడీఏ పీవో కానీ, సంబంధిత అధికారులు కానీ వచ్చి నిర్వాసితుల కష్టాలు తెలుసుకోవాలన్నారు. ఇదిలా ఉండగా పునరావాసంపై మరోసారి ఐటీడీఏ పీవో కూనవరంలో గ్రామసభ నిర్వహించనున్నారు. ఈ సభలోనైనా నిర్వాసితులకు స్పష్టమైన హామీ రావాలని వారు కోరుతున్నారు.



సూర్యకిరణం.. సింహభాగం..



గోదావరి.. ఆపై సూర్యాస్తమయం ఎంతో బాగుంటుంది. యానాం రాజీవ్ గాంధీ బీచ్ గౌతమీ గోదావరి ఒడ్డున సాయంత్రం సమయంలో కిరణాలు గోదావరిపై పడినప్పుడు.. అక్కడే ఉన్న సింహం బొమ్మ నోటి భాగాన సూర్యుడు ఉన్నట్టు కనిపించిన ఈ దృశ్యాలను 'ఆంధ్రజ్యోతి' కెమెరా క్లిక్ మనిపించిందిలా..

- యానాం (ఆంధ్రజ్యోతి)



సమావేశంలో మాట్లాడుతున్న పీడీజే గంధం సునీత

జాతీయ లోక్ అదాలత్‌లో

ఎక్కువ కేసులు పరిష్కారం కావాలి

పీడీజే గంధం సునీత ఆదేశం

రాజమహేంద్రవరం, డిసెంబరు 8(ఆంధ్రజ్యోతి): ఈ నెల 13న నిర్వహించే జాతీయ లోక్ అదాలత్‌లో పెద్దసంఖ్యలో కేసుల పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లా ప్రధాన న్యాయమూర్తి, జిల్లా న్యాయ సేవాధికార సంస్థ చైర్‌పర్సన్ గంధం సునీత ఆదేశించారు. ఈ మేరకు రాజమహేంద్రవరంలో సోమవారం ఇన్సూరెన్స్ సంస్థల ప్రతినిధులు, న్యాయవాదులతో ఆమె సమావేశమయ్యారు. కేసుల పరిష్కారంతోపాటు తగు పరిహారం అందించడానికి తీసుకోవాల్సిన చర్యలపై చర్చించారు. పెండింగ్‌లో ఉన్న సివిల్, కాంపౌండబుల్ క్రిమినల్ కేసుల జాబితాను డీఎల్ఎస్ఏకి అందజేయాలని సూచించారు. డీఎల్ఎస్ఏ కార్యదర్శి సీనియర్ సివిల్ జడ్జి శ్రీలక్ష్మి పాల్గొన్నారు.

చేబ్రోలులో వైద్య, ఆరోగ్య శాఖ ఆర్డీ విచారణ



ఆర్డీ డాక్టర్ పద్మ శశిధర్‌కు వినతిపత్రం అందజేస్తున్న టీడీపీ, జనసేన నాయకులు

గొల్లప్రోలు, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి): కాకినాడ జిల్లా గొల్లప్రోలు మండలం చేబ్రోలు పీహెచ్‌సీని వైద్య, ఆరోగ్య శాఖ రీజనల్ డైరెక్టర్ (ఆర్డీ) డాక్టర్ పద్మ శశిధర్ సోమవారం పరిశీలించారు. ఈనెల 2న ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి తాళం వేసి ఉండడంతో సకాలంలో వైద్యం అందక శరభవరం గ్రామానికి చెందిన ఇమ్మంది మాణిక్యం మృతిచెందాడు. అదేరోజు కాకినాడ డీఎంఅండ్‌హెచ్‌వో నరసింహనాయక్ విచారణ చేసి డాక్టర్ సాయిరతన్‌ను సస్పెండ్ చేసి స్టాఫ్ నర్సుకు షోకాజ్ నోటీసు ఇచ్చారు. ఇదే విషయంపై డాక్టర్ పద్మ శశిధర్ పూర్తిస్థాయిలో ఆసుపత్రిని తనిఖీ చేసి ఆ రోజు జరిగిన సంఘటనపై విచారణ చేశారు. టీడీపీ, జనసేన నాయకులు ఆసుపత్రిలో సమస్యలపై ఆమెకు వినతిపత్రాలు అందజేశారు. డీఎంహెచ్‌వో పీహెచ్‌సీకి వైద్య సిబ్బంది సక్రమంగా నియమించకపోవడం వల్లే ఇటువంటి సంఘటనలు ఎదురవుతున్నాయని ఆమెకు వివరించారు. సిబ్బంది డిప్యూటేషన్ రద్దు చేయాలని పలుమార్లు కోరినా పట్టించుకోలేదని తెలిపారు. ఈ ఘటనలో డాక్టర్‌పై చర్యలు తీసుకోవడం సరికాదని ఆర్డీ దృష్టికి తీసుకెళ్లగా, ఆమె లిఖితపూర్వకంగా ఫిర్యాదు ఇవ్వాలని కోరడంతో.. ఆవిధంగా వినతిపత్రం ఇచ్చారు. డీఎంఅండ్‌హెచ్‌వో నరసింహనాయక్, జిల్లా మలేరియా అధికారి డాక్టర్ ప్రభాకర్ పాల్గొన్నారు.

మహిళ మెడలో

బంగారు ఆభరణం చోరీ

కేసు నమోదు

అమలాపురం టౌన్, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి): డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా అమలాపురం సినిమా రోడ్డులో ఉన్న శుభకలశం సెంటర్‌లో నివాసం ఉంటున్న గుబ్బల చంద్రావతి తెల్లవారుజామున టాయిలెట్‌కు వెళ్లి తిరిగి వస్తుండగా మెడలో ఉన్న 3 కాసుల బంగారు ఆభరణాన్ని దొంగ అపహరించుకుపోయాడు. చంద్రావతి ఇచ్చిన ఫిర్యాదుతో సీఐ పి.వీరబాబు ఆధ్వర్యంలో పోలీసులు కేసు నమోదు చేశారు.

చింతూరులో స్క్రబ్ టైఫస్ కేసు

బాధితుడు ప్రభుత్వ ఉద్యోగి

చింతూరు, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి): అల్లూరి జిల్లా చింతూరులో స్క్రబ్ టైఫస్ కేసు నమోదైనట్టు సోమవారం చింతూరు ఏరియా ఆసుపత్రి సూపరింటెండెంట్ డా.కోటిరెడ్డి తెలిపారు. బాధితుడు ప్రభుత్వ ఉద్యోగి. వ్యాధి లక్షణాలను గుర్తించిన తదుపరి నిర్ధారణ పరీక్షలు చేశారు. ఈక్రమంలో బాధితుడు స్క్రబ్ టైఫస్ వ్యాధిన బారిన పడినట్టు నిర్ధారణ అయ్యింది. ఈ మేరకు చికిత్స అందిస్తున్నారు. బాధితుడి ఆరోగ్య పరిస్థితి నిలకడగా ఉందని వైద్యులు తెలిపారు. చింతూరు ఏరియా ఆసుపత్రిలో వ్యాధి నిర్ధారణ పరీక్షలు చేయించుకొనేందుకు కిట్లు అందుబాటులో ఉన్నాయని.. ఎవరికైనా వ్యాధి లక్షణాలు కనిపిస్తే సకాలంలో ఆసుపత్రికి చేరుకుని చికిత్స పొందాల్సిందిగా డా.కోటిరెడ్డి సూచించారు.

ఆటో బోల్తా.. డ్రైవర్ మృతి



చిన గంగరాజు(ఫైల్)

గొల్లప్రోలు రూరల్, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి): కాకినాడ జిల్లా గొల్లప్రోలు మండలం చేబ్రోలు శివారులో ఆటో బోల్తా పడి డ్రైవర్ మరణించాడు. గ్రామానికి చెందిన కోరగంటి చిన గంగరాజు(38) రాజమహేంద్రవరంలో ఉంటున్నాడు. గ్రామంలో పని ఉండడంతో ఆదివారం రాత్రి చేబ్రోలు వచ్చాడు. ఇంటి వద్ద తినడానికి ఏమైనా తెమ్మని చెప్పడంతో ఆటో తీసుకుని చేబ్రోలు-మల్లవరం రోడ్డుకు వెళ్లగా అదుపు తప్పి బోల్తా పడింది. తీవ్రంగా గాయపడిన గంగరాజును పిఠాపురం ప్రభుత్వాసుపత్రికి తీసుకువెళ్లగా అక్కడ చికిత్స పొందుతూ మరణించారు. గంగరాజు టీడీపీలో క్రియాశీలకంగా ఉండటంతో పాటు సాయిరామ్ ఆటో యూనియన్ సభ్యుడిగా ఉన్నారు. గొల్లప్రోలు ఎస్ఐ రామకృష్ణ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

అన్నప్రసాద వితరణలో

భక్తులకు ఇబ్బందులు ఉండకూడదు

కాకినాడ కలెక్టర్ షాన్‌మోహన్
అన్నవరం దేవస్థానం అధికారులకు పలు సూచనలు

అన్నవరం, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి): సుదూర ప్రాంతాల నుంచి కాకినాడ జిల్లా అన్నవరం సత్యదేవుడి సన్నిధికి విచ్చేసే భక్తులు స్వామి దర్శనానంతరం అన్నప్రసాదం స్వీకరించేందుకు విచ్చేసే సమయంలో వారికి ఇబ్బందులు లేకుండా చూడాలని జిల్లా కలెక్టర్ షాన్‌మోహన్ సూచించారు. సోమవారం జిల్లా కలెక్టర్‌ను ఆయన కార్యాలయంలో దేవస్థానం ఈవో సుబ్బారావు, అన్నదాన విభాగ ఏఈవో కృష్ణారావు, ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ రామకృష్ణ కలిశారు. హాల్‌లో భక్తులకు నిరీక్షణ లేకుండా అన్నప్రసాదం రుచి, శుచిగా అందించాలని కలెక్టర్ సూచించారు. ప్రస్తుత క్యూలైన్ ఇరుకుగా ఉందని దానిని నూతన భవనం పూర్తయ్యే సమయం వరకు తాత్కాలిక పద్ధతిలో విశాలంగా విస్తరించాలన్నారు. నూతన మరుగుదొడ్ల నిర్మాణ విషయంపై చర్చించారు.

నిత్యాన్నదానానికి రూ.లక్ష విరాళం

అన్నవరం, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి): అన్నవరం దేవస్థానంలో ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న సత్యదేవ నిత్యాన్నదాన పథకానికి సోమవారం ఒక దాత రూ.లక్ష విరాళంగా సమర్పించారు. హైదరాబాద్‌కు చెందిన చింతా అవినాస్ దంపతులు ఈ మొత్తాన్ని ఆలయ ఈవో సుబ్బారావుకు అందజేశారు. దాతను ఆయన అభినందించారు. దేవస్థానం ఉద్యోగుల సంఘం అధ్యక్షుడు గంటా విష్ణు ఉన్నారు.



ఈవోకు విరాళం అందజేస్తున్న దాత

అంతర్జాతీయ బ్యాడ్మింటన్ పోటీలకు

న్యాయనిర్ణేతగా శ్రీనివాసరావు

అమలాపురం రూరల్, డిసెంబరు 8(ఆంధ్రజ్యోతి): ఒడిసా అండర్-2025 మాస్టర్స్-2025 బ్యాడ్మింటన్ వరల్డ్ ఫెడరేషన్ టూర్ హండర్డ్ అంతర్జాతీయ టోర్నమెంట్‌కు న్యాయ నిర్ణేతగా డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా కొంకాపల్లికి చెందిన పాయసం శ్రీనివాసరావుకు అవకాశం దక్కింది. బ్యాడ్మింటన్ అసోసియేషన్ ఆఫ్ ఇండియా నుంచి సోమవారం నియామక ఉత్తర్వులను అందుకున్నారు. ఈ నెల 9 నుంచి 14వ తేదీ వరకు ఒడిసాలోని కటక్ జవహర్‌లాల్ నెహ్రూ స్టేడియంలో ఒడిసా బ్యాడ్మింటన్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఈ టోర్నమెంట్ జరుగుతుంది. ప్రపంచంలోని వివిధ దేశాలకు చెందిన క్రీడాకారులు పాల్గొంటారు. బ్యాడ్మింటన్ అసోసియేషన్ ఆఫ్ ఇండియా గ్రేడ్-2 నేషనల్ ఎంపైర్ అయిన శ్రీనివాసరావు ప్రస్తుతం నల్లచెరువు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఫిజికల్ డైరెక్టర్‌గా విధులు నిర్వహిస్తున్నారు. ఇప్పటికే పలు జాతీయ, అంతర్జాతీయ టర్నోమెంట్‌కు న్యాయనిర్ణేతగా వ్యవహరించారు. అంతర్జాతీయ బ్యాడ్మింటన్‌కు మరోసారి న్యాయనిర్ణేతగా నియమితులైన శ్రీనివాసరావును ఏపీ బ్యాడ్మింటన్ అసోసియేషన్ కార్యదర్శి అంకమ్మచౌదరి, ఉమ్మడి జిల్లా అసోసియేషన్ కార్యదర్శి బాబు, కేఎస్‌డీఏ అధ్యక్షుడు మెట్ల రమణబాబు, ఉపాధ్యక్షుడు అల్లాడ శరత్‌బాబు, బీవీసీ సంస్థల అధినేత బోనం కనకయ్య, గంధం పల్లంరాజు తదితరులు అభినందించారు.



పాయసం శ్రీనివాసరావు

తూకం.. మోసం!

చేబ్రోలు పట్టు మార్కెట్‌లో తూనికల మోసం
100 కిలోలకు 2.50 కిలోల తరుగు
పట్టు రైతుల ఆందోళన



గొల్లప్రోలు మండలం చేబ్రోలులో ఆందోళన చేస్తున్న పట్టు రైతులు



50 కిలోల తూనికల రాళ్లు వేస్తే 48.88 కిలోలు మాత్రమే చూపిస్తున్న మిషన్

పిఠాపురం/గొల్లప్రోలు రూరల్, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి): కాకినాడ జిల్లా గొల్లప్రోలు మండలం చేబ్రోలులోని ప్రభుత్వ పట్టుగూళ్ల విక్రయ కేంద్రం (పట్టు మార్కెట్)లో తూనికల విషయంలో మోసం జరుగుతుందంటూ రైతులు సోమవారం ఆందోళనకు దిగారు. పట్టు మార్కెట్‌లో ఉన్న వెయింగ్ మిషన్‌ను మూడు సంవత్సరాలుగా తూనికల కొలతల శాఖకు తనిఖీల నిమిత్తం పంపకుండా పట్టు పరిశ్రమల శాఖ అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరించారని వారు ఆరోపించారు. దీని వల్ల పట్టుగూళ్ల బరువు 100 కిలోలకు 2.50 కిలోలు తక్కువగా చూపిస్తున్నదని తెలిపారు. 50కిలోల తూకం రాళ్లు తీసుకువచ్చి మిషన్‌పై వేయగా 48.88 కిలోలు మాత్రమే చూపించడాన్ని వారు గుర్తించారు. తూకంలో మోసంతో తాము లక్షలాది రూపాయిలను నష్టపోయామని, దీనికి బాధ్యులైన అధికారులను గుర్తించి చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తూ గొల్లప్రోలు మండలం చేబ్రోలు సెరీకల్చర్ ఫారమ్, పిఠాపురం పట్టుఇంలోని పాడా కార్యాలయం వద్ద ధర్నా నిర్వహించారు. మూడు సంవత్సరాలుగా నష్టపోయిన తమకు న్యాయం చేయాలని వారు డిమాండ్ చేశారు. అనంతరం పాడా ప్రాజెక్టు డైరెక్టర్ శ్రీనివాసరావుకు వినతిపత్రం అందజేశారు. ఆందోళనలో రైతులు సీహెచ్.చక్రబాబు, రామకృష్ణ, ఉలవకాయల రాంబాబు, నల్లరావుల ఏసుబాబు, ఓ.ఏసుబాబు, గంగాధర్, శ్రీను, రామారావు, సూరిబాబు, శివ, వెంకటరమణ తదితరులు ఉన్నారు.

మూసివేసిన చర్చిలను తెరిపించాలి

కాకినాడ కలెక్టర్‌ను కోరిన గొల్లప్రోలుకు చెందిన పాస్టర్లు



కలెక్టర్ షాన్‌మోహన్‌కు వినతిపత్రం ఇస్తున్న వివిధ సంఘాల పాస్టర్లు

కలెక్టరేట్ (కాకినాడ), డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి): కాకినాడ జిల్లా గొల్లప్రోలు పరిధి కొత్తపేటలో మూసివేసిన చర్చిలను తిరిగి తెరిపించే విధంగా చర్యలు తీసుకోవాలని వివిధ సంఘాల పాస్టర్లు, క్రైస్తవులు సోమవారం కాకినాడలో జిల్లా కలెక్టర్ షాన్‌మోహన్‌ను కోరారు. ఈమేరకు వినతిపత్రం ఇచ్చారు. ఈ సందర్భంగా క్రైస్తవ పాస్టర్లు, ప్రతినిధులు జేమ్స్, జాన్‌వెస్లీ, గుడాల శాంతి, పెంకే శ్రీను, ఇజ్రాయల్, రాజు, ఎలియాజర్ మాట్లాడుతూ 40 ఏళ్లుగా నడుస్తున్న చర్చిలను హిందూ సంఘాలు ఆందోళన నేపథ్యంలో మూసివేయడం తగదన్నారు. భారత రాజ్యాంగం ప్రకారం అన్ని మతాలకు వారి భావాలను వ్యక్తపర్చే హక్కులు ఉన్నాయన్నారు. ఎవరికీ ఇబ్బందులు లేకుండా ప్రశాంత వాతావరణంలో చర్చిలు నిర్వహిస్తుంటే మూసివేయడం సమంజసం కాదని పేర్కొన్నారు. ఇప్పటికైనా దీనిపై విచారణ నిర్వహించి చర్చిలు తిరిగి ప్రారంభించే విధంగా కలెక్టర్ చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. లేకపోతే న్యాయస్థానాన్ని ఆశ్రయిస్తామని పాస్టర్లు, క్రైస్తవులు వెల్లడించారు.

గొల్లప్రోలులో

కొనసాగుతున్న పోలీసు పికెట్

ప్రార్థనా మందిరాల వద్ద సర్వే

గొల్లప్రోలు, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి): గొల్లప్రోలులో హిందూ సంఘాల ఆందోళన తదనంతరం పరిణామాల నేపథ్యంలో ఏర్పడిన ఉద్రిక్త పరిస్థితులు కొనసాగుతున్నాయి. కొత్తపేట ప్రాంతంలో అనుమతులు లేకుండా రెండు చర్చిలు నిర్వహిస్తున్నారని, లౌడ్‌స్పీకర్లతో ఇబ్బందులు కలిగిస్తున్నారంటూ హిందూ సంఘాలు ఆందోళనకు దిగడం, కాకినాడ ఆర్డీవో మల్లిబాబు అక్కడ పర్యటించి చర్చిల కార్యకలాపాలు తాత్కాలికంగా నిలిపివేయాలని ఆదేశించిన సంగతి తెలిసిందే. ఇరువర్గాలు అక్కడ మోహరించిన నేపథ్యంలో కొత్తపేటలో నిషేధాజ్ఞలు విధించి అమలు చేస్తున్నారు. ఆర్డీవో ఆదేశాలు మేరకు ప్రార్థనా మందిరాలు ఉన్న ప్రాంతంలో నగర పంచాయతీ టీపీవో నీలిమాదీప్తి ఆధ్వర్యంలో సిబ్బంది సర్వే నిర్వహించి కొలతలు సేకరించారు. వీటికి అనుమతులు ఎలా తీసుకున్నారు, ఆక్రమణలు ఉన్నాయా లేదా తదితర అంశాలను ఆర్డీవోకు నివేదించనున్నారు. మరోవైపు ఆ ప్రాంతంలో ఏర్పాటు చేసిన పోలీసు పికెట్‌ను కొనసాగిస్తున్నారు. ప్రస్తుతం పరిస్థితి అదుపులోనే ఉందని గొల్లప్రోలు తహశీల్దారు రామ్‌కుమార్, ఎస్ఐ రామకృష్ణ తెలిపారు.



గొల్లప్రోలు కొత్తపేట ప్రాంతంలో ఏర్పాటు చేసిన పోలీసు పికెట్

ప్రిన్సిపల్ జిల్లా కోర్టుల ఏర్పాటుపై హైకోర్టు జడ్జి సానుకూల స్పందన

వెల్లడించిన 'ఐఎల్ఏ' అధ్యక్షుడు టి.పృథ్వీరాజ్

కాకినాడ, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి): కోర్టు ప్రాంగణాల్లో మౌలిక వసతులు కల్పించాలి, నూతన కోర్టు భవనాలకు నిధులు మంజూరు చేయాలని కోరడంతో పాటు పలు సమస్యలపై న్యాయవాదులు పోరాడుతున్నారు. కోర్టు భవనాలకు మైనర్ రిపేర్లు చేయాలని, కాకినాడలో డెట్ రికవరీ ట్రిబ్యునల్(డీఆర్టీ) ఏర్పాటు చేయాలనే డిమాండ్‌ను కూడా వినిపిస్తున్నారు. జిల్లా విభజన దృష్ట్యా డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా అమలాపురం, కాకినాడల్లో ప్రిన్సిపల్ జిల్లా కోర్టులు ఏర్పాటు చేయాలని కోరుతున్నారు. ఈ సమస్యలపై హైకోర్టు న్యాయమూర్తి, జిల్లా పోర్టుఫోలియో జడ్జిగా నియమితులైన జడ్జి జస్టిస్ బట్టు దేవానంద్ సానుకూలంగా స్పందించారని ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా ఇండియన్ లాయర్స్ అసోసియేషన్ (ఐఎల్ఏ) అధ్యక్షుడు టి.పృథ్వీరాజ్ సోమవారం మీడియాకు వెల్లడించారు. జిల్లా వ్యాప్తంగా 16 బార్ అసోసియేషన్లు, 65 కోర్టుల్లో పదివేల మంది న్యాయవాదులు, 50వేలమంది కక్షిదారులు వస్తూ ఉంటారని, వారికి అవసరమైన మౌలిక వసతుల కల్పన విషయాన్ని జడ్జి జస్టిస్ దేవానంద్ దృష్టికి తీసుకెళ్లగా సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని హామీ ఇచ్చారని తెలిపారు.

రిటైనింగ్ వాల్ పనుల్లో అక్రమాలపై విచారణకు ఆదేశం

కలెక్టరేట్ (కాకినాడ), డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి): ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లా పరిధిలోని రామచంద్రపురం మండలం ఓదూరులో ఆర్‌సీసీ రిటైనింగ్‌వాల్ పనుల్లో జరిగిన అక్రమాలపై ప్రభుత్వం సోమవారం విచారణకు ఆదేశించింది. పలు ఉల్లంఘనల కారణంగా ప్రభుత్వానికి రూ.99.98 లక్షల నష్టం వాటిల్లినట్టు గుర్తించింది. ఈ నేపథ్యంలో పలువురు అధికారులను బాధ్యులుగా చేస్తూ విచారణకు ఆదేశించింది. ఇందులో భాగంగా అప్పటి క్వాలిటీ కంట్రోల్ కాకినాడ సబ్ డివిజన్ డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ తురంగి శ్రీనివాసు, మరో డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ వీవీ సత్యనారాయణ, ఏఈఈ బొల్లంకల అప్పలరాజులపై విచారణకు ప్రభుత్వం ఆదేశించింది. ఈ మేరకు రాష్ట్ర జలవనరుల శాఖ విజిలెన్స్ విభాగం ఉత్తర్వులు ఇచ్చింది.

కొడుకుపై తల్లి ఫిర్యాదు

కొబ్బరికాయలు దొంగిలించాడని కేసు

అమలాపురం రూరల్, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి): కొబ్బరికాయలు దొంగిలించాడని కుమారుడిపై తల్లి చేసిన ఫిర్యాదు మేరకు అమలాపురం పట్టణ పోలీసులు సోమవారం కేసు నమోదు చేశారు. డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా పేరూరుకు చెందిన దూడల సత్యవతికి అదే గ్రామంలో 2ఎకరాల కొబ్బరి తోట ఉంది. తోటలో కొడుకు సత్తిపండు స్నేహితులతో కలసి కొబ్బరిదింపు తీసి 6వేల కాయలు తరలించుకుపోయాడని ఇచ్చిన ఫిర్యాదుపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు సీఐ వీరబాబు తెలిపారు.

ఫోన్ చూస్తూ కాలక్షేపం చేస్తున్నాడని

కొడుకుపై తండ్రి మందలింపు

ఇంటి నుంచి వెళ్లిపోవడంతో పోలీసులకు ఫిర్యాదు



అదృశ్యమైన ప్రదీప్

గొల్లప్రోలు, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి): కాకినాడ జిల్లా గొల్లప్రోలు మండలం చేబ్రోలుకు చెందిన బాలుడు అదృశ్యంపై ఎస్ఐ రామకృష్ణ కేసు నమోదు చేశారు. చేబ్రోలు హరేరామ నగర్‌కు చెందిన జాగు ప్రదీప్ (17) ఈనెల 6న ఫోన్ చూస్తూ కాలక్షేపం చేస్తున్నాడని తండ్రి సత్యనారాయణ మందలించాడు. దాంతో ఆ రోజు ఇంటి నుంచి బయటకు వెళ్లిపోయి తిరిగిరాలేదు. దీంతో తండ్రి గొల్లప్రోలు పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా పోలీసులు కేసు నమోదు చేశారు. ప్రదీప్ చేబ్రోలు ఆదర్శ కాలేజీలో బీటెక్ మొదటి సంవత్సరం చదువుతున్నాడు. కాఫీ కలర్ టీ షర్టు, కార్గో స్కూ బ్లూ ప్యాంటు ధరించాడని, ఆచూకీ తెలిస్తే పోలీసులకు సమాచారం ఇవ్వాలని కోరారు.

వృద్ధాశ్రమ పనుల పరిశీలన

పెద్దాపురం, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి): పట్టణంలో నిర్మిస్తున్న వృద్ధాశ్రమ పనులను ఎమ్మెల్యే నిమ్మకాయల చినరాజప్ప సోమవారం పరిశీలించారు. పనుల పురోగతిపై అధికారులను అడిగి తెలుసుకున్నారు. ప్రధానమంత్రి ఉజ్వల యోజన పథకం కింద నియోజకవర్గంలో 500 గ్యాస్ కనెక్షన్లు అందజేసినట్టు తెలిపారు. కొత్తెం వెంకట శ్రీనివాసరావు (కోటి), కందుల విశ్వేశ్వరరావు, ఎలిశెట్టి నాని, సింగన అరవింద్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.



మహిళలకు గ్యాస్ కనెక్షన్లు అందజేస్తున్న ఎమ్మెల్యే నానాజీ

‘ఉజ్వల’ గ్యాస్ కనెక్షన్ల పంపిణీ

సర్పవరం జంక్షన్, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి): ఉజ్వల-3.0 పథకంలో అర్హులైన ప్రతి ఒక్కరికీ ఉచితంగా గ్యాస్ కనెక్షన్లు, సిలిండర్లు పంపిణీ చేస్తున్నట్టు కాకినాడ రూరల్ ఎమ్మెల్యే పంతం నానాజీ పేర్కొన్నారు. సోమవారం గొడారిగుంటలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో జిల్లా సివిల్ సప్లయిస్ అధికారి సత్యనారాయణరాజు ఆధ్వర్యంలో 763 మంది మహిళా లబ్ధిదారులకు రూ.34.33 లక్షల విలువైన గ్యాస్ కనెక్షన్లను ఆయన ఎమ్మెల్సీ కర్రి పద్మశ్రీ, మాజీ మంత్రి చిక్కాల రామచంద్రరావు, కూటమి నాయకుడు రంబాల వెంకటేశ్వరరావుతో కలిసి పంపిణీ చేశారు. కార్యక్రమంలో శెట్టిబలిజ కార్పొరేషన్ డైరెక్టర్ చప్పిడి వెంకటేశ్వరరావు, కూటమి నాయకులు నులుకుర్తి వెంకటేశ్వరరావు, కరెడ్ల గోవిందు, మాదారపు తాతాజీ, బందిరి వీరీష, తాటికాయల వీరబాబు, సోదె ముసలయ్య, గోపు వెంకటరమణ, బోళ్ల కృష్ణమోహన్, తహసీల్దారు కుమారి, ఎంఎస్‌వో వీరాస్వామి, పలు గ్యాస్ ఏజెన్సీల ప్రతినిధులు, లబ్ధిదారులు పాల్గొన్నారు.

ఒకరికి ఇద్దరు తోడయ్యారు

సామర్లకోట, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి): ‘ఒకే విద్యార్థి... ఒకే టీచరు’ శీర్షికన ఆంధ్రజ్యోతిలో వచ్చిన కథనానికి విద్యా శాఖాధికారులు స్పందించారు. డీఈవో పి.రమేష్ ఆదేశాలతో కోదండరామపురం మున్సిపల్ ప్రాథమిక పాఠశాలను ఎంఈవోలు వై.శివరామకృష్ణయ్య, పట్టపగలు పుల్లయ్య సోమవారం సందర్శించారు. పాఠశాల ఆవాస ప్రాంతంలో ఉన్న ఇద్దరు బడి ఈడు పిల్లలను పాఠశాలకు చేర్చేలా వారి తల్లిదండ్రులతో చర్చించారు. దీంతో చిన్నారులిద్దరినీ పాఠశాలకు తీసుకువచ్చి ఉపాధ్యాయురాలు గౌతమికి అప్పగించారు. మరో ఇద్దరు బడి ఈడు చిన్నారులను రానున్న విద్యా సంవత్సరంలో పాఠశాలలో చేరుస్తామని తల్లిదండ్రులు హామీ ఇచ్చారు. దీంతో ముగ్గురు చిన్నారులకు మధ్యాహ్న భోజనాన్ని ఎంఈవోల సమక్షంలో అందించారు. విద్యా శాఖ సిబ్బంది పర్యవేక్షణాలోపంపై పూర్తి నివేదికలను రూపొందించి డీఈవోకు అందజేస్తామని ఎంఈవో శివరామకృష్ణయ్య తెలిపారు. తాను కూడా పాఠశాల ఆవాస ప్రాంతంలో సర్వేలో పాల్గొని విద్యార్థుల సంఖ్య పెంచేందుకు కృషి చేస్తానని ఉపాధ్యాయురాలు గౌతమి ఎంఈవోలకు చెప్పారు.

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్



కోదండరామపురం మున్సిపల్ పాఠశాలలో ముగ్గురు విద్యార్థులతో ఎంఈవోలు

కాగా కోదండరామపురం మున్సిపల్ ప్రాథమిక పాఠశాల వ్యవహారంలో సమగ్ర దర్యాప్తు జరిపి విద్యా శాఖాధికారులపై చర్యలు తీసుకోవాలని మున్సిపల్ కమిషనరు శ్రీవిద్య, ఎంఈవో వై.శివరామకృష్ణయ్యలకు జిల్లా మానవహక్కుల పరిరక్షణ సంఘం అధ్యక్షుడు నూతలపాటి అప్పలకొండ ఫిర్యాదు చేశారు.



సామర్లకోట మున్సిపల్ కార్యాలయం ఎదుట ధర్నా చేస్తున్న మహిళలు

టిడ్కో ఫ్లాట్ల రుణాలు రద్దు చేయాలని ధర్నా

సామర్లకోట, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి). సామర్లకోట పట్టణ పరిధిలో గత ప్రభుత్వం నిర్మించిన టిడ్కో ప్లాట్ల లబ్ధిదారులు తమ రుణాలు రద్దు చేయాలని, ప్రైవేట్ బ్యాంకు రుణాలు ఎంతమాత్రం అంగీకరించబోమని పేర్కొంటూ సామర్లకోట మున్సిపల్ కార్యాలయం ఎదుట సోమవారం మధ్యాహ్నం మహిళలు పెద్ద ఎత్తున ధర్నా నిర్వహించారు. ఐద్వా జిల్లా అధ్యక్షురాలు భూలక్ష్మి, కార్యదర్శి సీహెచ్ రమణి మాట్లాడుతూ ఎన్నికల ముందు ప్రజలకు ఇచ్చిన హామీలో భాగంగా భేషరతుగా టిడ్కో ఫ్లాట్‌లను ఎటువంటి రుణం లేకుండా నేరుగా అప్పగించాలని డిమాండ్ చేశారు. ఈ మేరకు మున్సిపల్ కమిషనరు శ్రీవిద్యకు వినతిపత్రం అందించారు. ప్రభుత్వం దిగిరాకుంటే లబ్ధిదారులందరినీ సమీకరించి పెద్ద ఎత్తున ఉద్యమిస్తామని మహిళలు ప్రభుత్వాన్ని హెచ్చరించారు. సామర్లకోట ఐద్వా నాయకురాలు ఎస్.వరలక్ష్మి, బాలం లక్ష్మి, ఎ.శ్యామల, ఎం.సత్యవతి, వెంకటలక్ష్మి, ఎ.దుర్గాలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.



పిఠాపురంలో అర్జీలు స్వీకరిస్తున్న పాడా ప్రాజెక్టు డైరెక్టర్ శ్రీనివాసరావు



కాకినాడలో అర్జీదారుడితో మాట్లాడుతున్న అదనపు కమిషనరు సుధాకర్

‘పీజీఆర్ఎస్ అర్జీలను సత్వరం పరిష్కరించాలి’

కార్పొరేషన్ (కాకినాడ), డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి): పీజీఆర్ఎస్‌లో వచ్చిన అర్జీలను వేగవంతంగా పరిష్కరించేందుకు అధికారులు చర్యలు తీసుకోవాలని నగర పాలక సంస్థ అదనపు కమిషనరు కేటీ సుధాకర్ ఆదేశించారు. సోమవారం జరిగిన పీజీఆర్ ఎస్‌లో పలు సమస్యలపై 11 అర్జీలు అందాయి. డయల్ యువర్ కమిషనరుకు ఇద్దరు ఫోను చేసి సమస్యలు తెలిపారు. ఎస్ఈ వెంకట్రావు, హెల్త్ ఆఫీసర్ డాక్టర్ పృథ్వీచరణ్, డీసీపీ కృష్ణారావు, టీపీఆర్వో శైలజ, మేనేజరు సీతారాం పాల్గొన్నారు.

పిఠాపురం (ఆంధ్రజ్యోతి): ప్రజల వినతులను త్వరితగతిన పరిష్కరించాలని పాడా ప్రాజెక్టు డైరెక్టర్ శ్రీనివాసరావు అధికారులను ఆదేశించారు. పట్టణంలోని పాడా కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదికలో నియోజకవర్గంలోని వివిధ ప్రాంతాలకు చెందిన ప్రజలు 43 అర్జీలు అందజేశారు. మూడు మండలాల తహసీల్దార్లు, ఎంపీడీవోలు, మున్సిపల్ కమిషనర్లు, అన్ని ప్రభుత్వ శాఖల అధికారులు పాల్గొన్నారు.

‘వాజపేయి విగ్రహాల ఏర్పాటుకు సహకరించాలి’

సర్పవరం జంక్షన్, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి): మాజీ ప్రధాని అటల్ బిహారీ వాజ్‌పేయి విగ్రహాల ఏర్పాటుకు సహకారం అందించాలని బీజేపీ సీనియర్ నాయకులు వై.మాలకొండయ్య, రంబాల వెంకటేశ్వరరావు, పైడా భావనప్రసాద్ కోరారు. సోమవారం వారు గొడారిగుంటలోని క్యాంపు కార్యాలయంలో ఎమ్మెల్యే పంతం నానాజీని కలుసుకుని వినతిపత్రం అందించారు. బీజేపీ నాయకులు వి.సూర్యనారాయణరాజు, బి.వెంకటరామకృష్ణ, పెండెం సత్యనారాయణ, శెట్టిబలిజ కార్పొరేషన్ డైరెక్టర్ చప్పిడి వెంకటేశ్వరరావు, టీడీపీ నాయకులు నులుకుర్తి వెంకటేశ్వరరావు, పక్కి మణిబాల, నందూరి సత్తిబాబు పాల్గొన్నారు.



ఎమ్మెల్యే నానాజీతో కూటమి నాయకులు

‘బయోమెట్రిక్ అటెండెన్స్ కచ్చితంగా నమోదు చేయాలి’

పెద్దాపురం, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి): సచివాలయ సిబ్బంది రోజుకు రెండుసార్లు బయోమెట్రిక్ అటెండెన్స్ కచ్చితంగా వేయాలని ఎంపీడీవో కేవీ సూర్యనారాయణ కోరారు. సోమవారం ఆయన సచివాలయ సిబ్బందితో సమావేశం నిర్వహించారు. ప్రభుత్వ సర్వేలను సకాలంలో పూర్తి చేయాలన్నారు. జీఎస్‌డబ్ల్యుఎస్ అధికారి శ్రీహరి, డిప్యూటీ ఎంపీడీవో శేఖర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

దీర్ఘకాల సమస్యలను తక్షణం పరిష్కరించాలి

సహకార సంఘాల ఉద్యోగుల ధర్నా

పిఠాపురం, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి): సహకార సంఘాల ఉద్యోగుల దీర్ఘకాల సమస్యలను తక్షణం పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ పిఠాపురంలోని డీసీసీబీ బ్రాంచి కార్యాలయం వద్ద ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర వ్యవసాయ సహకార సంఘాల ఉద్యోగుల యూనియన్ల ఐక్య వేదిక ఆధ్వర్యంలో సోమవారం ధర్నా నిర్వహించారు. పెండింగులో ఉన్న 2019, 2024 సంవత్సరాల వేతన సవరణలు అమలు చేసి బకాయిలు చెల్లించాలని, చట్టప్రకారం గ్రాట్యుటీ చెల్లించాలని, ఉద్యోగులకు ఆరోగ్య బీమా అమలు చేయాలని, రూ.20లక్షల టర్మ్ ఇన్సూరెన్స్ పాలసీ చేయించాలని, 2019 తర్వాత సంఘాల్లో చేరిన ఉద్యోగులను పర్మినెంట్ చేయాలని నినాదాలు చేశారు. ఉద్యోగ విరమణ వయసు 62 సంవత్సరాలు అయినా 58 ఏళ్లకే బలవంతంగా ఉద్యోగ విరమణ చేయిస్తున్నారని ఇది దారుణమన్నారు. సమస్యలను పరిష్కరించే వరకు ఆందోళనలు కొనసాగుతాయని స్పష్టం చేశారు. బ్రాంచి పరిధిలోని సొసైటీల ఉద్యోగులు, ఐక్య వేదిక ప్రతినిధులు పాల్గొన్నారు. వీరి ఆందోళనకు పలు సంఘాల నేతలు సంఘీభావం తెలిపారు.



పిఠాపురంలో డీసీసీబీ బ్రాంచి వద్ద ధర్నా చేస్తున్న సహకార సంఘాల సిబ్బంది

పెద్దాపురం (ఆంధ్రజ్యోతి): సహకార ఉద్యోగులు డీసీసీబీ బ్రాంచి వద్ద ధర్నా నిర్వహించారు. మేనేజరు జ్యోతికి వినతిపత్రం అందజేశారు. గుణ్ణం వీర వెంకట సత్యనారాయణ, శానపల్లి నాగభూషణం, అర్జునుడు పాల్గొన్నారు.

కొత్తపల్లి (ఆంధ్రజ్యోతి): మండలంలోని కొత్తపల్లి, యండపల్లి, నాగులాపల్లి, కొమరగిరి, ఇసుకపల్లి పీఏసీఎస్‌ల ఉద్యోగులు నల్లబ్యాడ్జీలు ధరించి డీసీసీబీ బ్రాంచి వద్ద ధర్నా చేపట్టారు. డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని మేనేజరు రమ్య, సూపర్‌వైజర్ పండులకు అందజేశారు.

తాళ్లరేవు (ఆంధ్రజ్యోతి): తాళ్లరేవులో సహకార సంఘాల ఉద్యోగులు నల్లబ్యాడ్జీలు ధరించి నిరసన తెలిపారు. వారికి సెంట్రల్ బ్యాంకు ఉద్యోగులు సంఘీభావం తెలిపారు. తాళ్లరేవు, కోరింగ, లచ్చిపాలెం, కోలంక, మంజేరు సహకార సంఘాల ఉద్యోగులు పాల్గొన్నారు.



ఉప్పాడ కొత్తపల్లిలో...



తాళ్లరేవులో...



పెద్దాపురంలో...

మహిళా సంఘాలకు రూ.1,052 కోట్ల రుణాలు

వెలుగు డీపీఎం వెంకటేశ్వరరావు

గొల్లప్రోలు, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి): కాకినాడ జిల్లాలోని 10,446 మహిళా సంఘాలకు ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో రూ.1.457 కోట్లు రుణాలు ఇవ్వడం లక్ష్యం కాగా ఇప్పటి వరకు బ్యాంకు లింకేజీ ద్వారా రూ.1,052 కోట్లు అందజేసినట్టు వెలుగు డీపీఎం (ఫైనాన్స్) వెంకటేశ్వరరావు తెలిపారు. మహిళా సంఘాలకు రుణాల మంజూరుపై సోమవారం ఆయన గొల్లప్రోలులో సమీక్షించారు. గొల్లప్రోలు మండలంలో 1,027 సంఘాలకు రూ.67.42 కోట్లు రుణాలు అందించాలన్నది లక్ష్యం కాగా ఇప్పటిదాకా రూ.52 కోట్లు అందించామన్నారు. పిఠాపురం మండలంలో 1133 సంఘాలకు రూ.62కోట్ల రుణ లక్ష్యానికి రూ.70కోట్లు, యు.కొత్తపల్లి మండలంలో 526 సంఘాలకు రూ.72కోట్లు లక్ష్యం కాగా రూ.50కోట్లును అందజేశామన్నారు. స్త్రీ నిధి బ్యాంకు ఏజీఎం శివకుమార్ మాట్లాడుతూ జిల్లాలో స్త్రీనిధి ద్వారా రూ.253.52 కోట్లు రుణాలుగా అందించాలన్నది లక్ష్యం కాగా ఇప్పటికి రూ.115.26కోట్లు ఇచ్చామన్నారు. బకాయిలు రూ.4కోట్లు కాగా పిఠాపురంలోనే రూ.62.15 లక్షలు ఉన్నాయన్నారు. సమావేశంలో ఏపీఎం(ఫైనాన్స్) షకీలాప్రియదర్శిని, గొల్లప్రోలు ఏపీఎం సన్యాసిరావు, సీసీలు నాయుడు, రమణ, శ్రీనివాస్ పాల్గొన్నారు.



రుణాల మంజూరుపై సమీక్షిస్తున్న వెంకటేశ్వరరావు

ప్రొఫెసర్ రాజీనామాకు ఆమోదం

జీజీహెచ్ (కాకినాడ), డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి): కాకినాడ రంగరాయ వైద్య కళాశాల సీటీ సర్జరీ ప్రొఫెసర్ డాక్టర్ ఎల్.హరివర్ధన్ వ్యక్తిగత కారణాలతో రాజీనామాకు దరఖాస్తు చేసుకున్నారు. దీనికి ప్రభుత్వం తెలిపింది. ఈ మేరకు వైద్య ఆరోగ్య శాఖ సోమవారం జీవోఆర్‌టీ నెం.872 జారీ చేసింది.



పోస్టర్లను ఆవిష్కరిస్తున్న ఎస్ఎఫ్ఐ నాయకులు

12 నుంచి ఎస్ఎఫ్ఐ రాష్ట్ర మహాసభలు

పిఠాపురం, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి): తిరుపతిలో ఈ నెల 12, 13, 14 తేదీల్లో నిర్వహిస్తున్న భారత విద్యార్థి ఫెడరేషన్ రాష్ట్ర మహాసభలను విజయవంతం చేయాలని ఎస్ఎఫ్ఐ నాయకులు కోరారు. పిఠాపురంలోని ఆర్ఆర్‌బీహెచ్ఆర్ ప్రభుత్వ జూనియర్ కళాశాలలో సోమవారం జరిగిన కార్యక్రమంలో రాష్ట్ర మహాసభల పోస్టర్లను వారు ఆవిష్కరించారు. విద్యా రంగం ఎదుర్కొంటున్న సమస్యలపై మహాసభల్లో చర్చించి కార్యాచరణ రూపొందిస్తామన్నారు. కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షులు సిద్ధూ, శ్రీకాంత్, నాయకులు జాన్, రామ్, సాయిలక్ష్మి, సిరి, వడ్డి కాసులు తదితరులు పాల్గొన్నారు.

కెరీర్ గైడెన్స్‌పై అవగాహన

కాకినాడ రూరల్, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి): కాకినాడ జగన్నాథపురంలోని ఎంఎస్ నాయకర్ డిగ్రీ కళాశాల ప్రథమ సంవత్సరం విద్యార్థులకు మానవ విలువలు, కెరీర్ గైడెన్స్‌పై ప్రిన్సిపాల్ జి.ఉషారాణి అధ్యక్షతన సోమవారం అవగాహన సదస్సు నిర్వహించారు. గౌరవ అతిథిగా ఎం.సత్యనారాయణ, ముఖ్య అతిథిగా డాక్టర్ ఆలపాటి శ్రీనివాస్ హాజరుకాగా కె.రజనీ కన్వీనర్‌గా వ్యవహరించారు. సమయపాలన, క్రమశిక్షణ పాటించాలని, తల్లిదండ్రులపై ఆధారపడకుండా ఖాళీ సమయంలో పార్ట్‌టైమ్ ఉద్యోగం చేయాలని వారు సూచించారు. అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

‘పన్నులు సకాలంలో చెల్లించాలి’

గొల్లప్రోలు రూరల్, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి): ఇంటి పన్నులను సకాలంలో చెల్లించడం ద్వారా గ్రామాభివృద్ధికి సహకరించాలని గొల్లప్రోలు ఎంపీడీవో సెలట్‌రాజు కోరారు. గొల్లప్రోలు మండలం దుర్గాడలో ఇంటి పన్నుల వసూళ్లకు సోమవారం స్పెషల్ డ్రైవ్ నిర్వహించారు. బకాయిలు అధికంగా ఉన్న వారి ఇళ్లకు వెళ్లి పన్నులు చెల్లించాలని నోటీసులు అందజేశారు. డిప్యూటీ ఎంపీడీవో విద్యాసాగర్‌కుమార్, పంచాయతీ కార్యదర్శి శ్రీనివాస్ పాల్గొన్నారు.

ప్రతి ఎకరాకూ సాగునీరందేలా చర్యలు

గోదావరి తూర్పు డెల్టా ప్రాజెక్టు కమిటీ చైర్మన్ మురాలశెట్టి సునీల్

పిఠాపురం, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి): గోదావరి డెల్టా పరిధిలో ప్రతి ఎకరాకు సాగునీరు అందేలా అన్ని చర్యలూ తీసుకున్నామని గోదావరి తూర్పు డెల్టా ప్రాజెక్టు కమిటీ చైర్మన్ మురాలశెట్టి సునీల్‌కుమార్ వెల్లడించారు. పీబీసీ పరిధిలోని పిఠాపురం పట్టణ శివారు, చిత్రాడ, యండపల్లి వద్ద కాలువల్లో నీటి ప్రవాహాన్ని ఆయన సోమవారం పరిశీలించి రైతులతో మాట్లాడారు. వంతుల వారీ విధానంలో సాగునీరు అందిస్తామని తెలిపారు. నీటి సంఘాల ప్రతినిధులను సమన్వయం చేసుకుంటూ ఇరిగేషన్ అధికారులు ఎప్పటికప్పుడు సాగునీటి సరఫరాను పర్యవేక్షించాలని ఆదేశించారు. నీటి సరఫరా పెంచాలని మాధవపురం, కొత్తపల్లి, కొమరగిరి రైతులు కోరారు. చిత్రాడ నీటి సంఘం అధ్యక్షుడు బసవా సత్తిబాబు, రాష్ట్ర శెట్టిబలిజ కార్పొరేషన్ డైరెక్టర్ పెంకే జగదీష్, దేశినీడి సతీష్, గుండ్ర జగ్గారావు, మత్స్యా శ్రీనివాసరావు, గుండ్ర కిషోర్, బాబ్జీ తదితరులు పాల్గొన్నారు.



పీబీసీ పరిధిలో సాగునీటి సరఫరాపై రైతులతో మాట్లాడుతున్న సునీల్‌కుమార్

కొత్తపల్లి (ఆంధ్రజ్యోతి): మండలంలోని మాదాపురం, కొత్తపల్లి, కొమరగిరి గ్రామాల్లోని వరి చేలల్లో ఆకుమడుల్లో నీటి నిల్వలను గోదావరి తూర్పు డెల్టా చైర్మన్ మురాలశెట్టి సునీల్‌కుమార్ పరిశీలించారు. నీటి సంఘాల అధ్యక్షులు, రైతులతో మాట్లాడారు. నీటి ఎద్దడి రాకుండా చర్యలు చేపట్టాలని ఇరిగేషన్ అధికారులకు సూచించారు. రైతులు నీటి అవసరాలకు 9515366262 నెంబరుకు ఫోన్ చేసి సంప్రదించవచ్చన్నారు.

ఆనూరులో దళితులపై వివక్ష

కలెక్టరేట్ (కాకినాడ), డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి): ఓటు వేయలేదనే నెపంతో ఆనూరు మాజీ సర్పంచ్ తమపట్ల కక్ష కట్టి హౌసింగ్ రుణాలు, ఇతర సంక్షేమ పథకాలు అందకుండా అడ్డుకుంటున్నారని ఏపీ రైతుకూలీ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కర్నాకుల వీరాంజనేయులు ఆరోపించారు. కలెక్టరేట్ వద్ద సోమవారం ఏపీ రైతుకూలీ సంఘం, ఏఐఎఫ్‌టీయూ, ప్రగతిశీల మహిళా సంఘం, పీడీఎస్‌యూ ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లాల కమిటీల ఆధ్వర్యంలో ధర్నా చేశారు. ఈ సందర్భంగా వీరాంజనేయులు మాట్లాడుతూ పెద్దాపురం మండలం ఆనూరులో 115 కుటుంబాలు అల్లూరి సీతారామరాజునగర్ నిర్మించుకుని గత 30 ఏళ్లుగా జీవిస్తున్నాయన్నారు. వీరంతా దళితవర్గానికి చెందినవారన్నారు. దళితులు తమ పార్టీకి ఓటు వేయలేదనే నెపంతో మాజీ సర్పంచ్, అధికార పార్టీ నాయకుడు అడ్డుకుంటున్నారని ధ్వజమెత్తారు. దళిత మహిళలపై దురుసుగా ప్రవర్తిస్తున్నారని విమర్శించారు. కలెక్టర్ తక్షణం ఆనూరు గ్రామానికి వెళ్లి విచారణ చేపట్టాలని డిమాండ్ చేశారు. అనంతరం జాయింట్ కలెక్టర్ అపూర్వభరత్‌కు వినతిపత్రం ఇచ్చారు. కార్యక్రమంలో ఏపీఆర్‌సీఎస్ ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు వల్లూరి రాజబాబు, ఏఐఎఫ్‌టీయూ కార్యదర్శి కుంచె అంజిబాబు, అధ్యక్షుడు మడికి సత్యం, పీడీఎస్‌యూ రాష్ట్ర కార్యదర్శి సతీష్, ఇతర నాయకులు రెడ్డి దుర్గాదేవి, రామలింగేశ్వరరావు, సత్తిబాబు, నాగరాజు, ఏసియా, గానుగుల సతీష్, యమున, శిరీష, మంగశ్రీ తదితరులు పాల్గొన్నారు.



కలెక్టరేట్ ఎదుట ధర్నా చేస్తున్న వివిధ సంఘాల నాయకులు, కార్యకర్తలు, ఆనూరు గ్రామస్తులు

పెద్దాపురం (ఆంధ్రజ్యోతి): ఆనూరు మాజీ సర్పంచ్ సింగన అరవింద్‌కుమార్‌పై అట్రాసిటీ కేసు నమోదు చేయాలని రైతుకూలీ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కర్నాకుల వీరాంజనేయులు డిమాండ్ చేశారు. ఈ మేరకు సోమవారం ఆర్డీవో కార్యాలయం వద్ద ధర్నా నిర్వహించారు. అనంతరం ఆర్డీవో శ్రీరమణికి వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో కుంచే అంజిబాబు, సత్యం, కడితి సతీష్ తదితరులు పాల్గొన్నారు.

‘రసాయన వ్యర్థాలు వదలుతున్న వారిపై చర్యలు తీసుకోవాలి’

సర్పవరం జంక్షన్, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి): ప్రమాదకరమైన రసాయనిక వ్యర్థాలను సముద్రంలో డంపింగ్ చేస్తున్న వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని వాకలపూడి, సూర్యారావుపేట మత్స్యకారులు డిమాండ్ చేశారు. సోమవారం వారు గొడారిగుంటలోని క్యాంపు కార్యాలయంలో ఎమ్మెల్యే పంతం నానాజీని కలుసుకున్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఇతర జిల్లాలతో పాటు తెలంగాణ నుంచి రసాయనిక వ్యర్థాలను ట్యాంకర్లలో తీసుకొచ్చి వాకలపూడి-సూర్యారావుపేట కాలువలో వదిలేయడంతో నేరుగా సముద్రంలో కలుస్తోందన్నారు. మత్స్య సంపదకు తీవ్ర నష్టం చేస్తున్న వారు ఎంతటి వారైనా ఉపేక్షించేది లేదని, సదరు వ్యక్తిపై ఇప్పటికే పోలీసు కేసు నమోదైందని ఎమ్మెల్యే చెప్పారు. తీర ప్రాంతంలో కాలుష్య నివారణపై కాలుష్య నియంత్రణ మండలి, రెవెన్యూ, పోలీసు, మత్స్య శాఖల అధికారులతో మాట్లాడతానని ఆయన హామీనిచ్చారు.

సీఐటీయూ అఖిల భారత మహాసభల పోస్టర్ ఆవిష్కరణ

పెద్దాపురం, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి): ఈ నెల 31 నుంచి జనవరి 4 వరకు విశాఖపట్నంలో జరిగే సీఐటీయూ అఖిల భారత మహాసభలను పోస్టర్లను సోమవారం ఆవిష్కరించారు. సిరిపురపు శ్రీనివాస్, చింతల సత్యనారాయణ, సత్యనారాయణ, శ్రీను, గంగ, అప్పన్న, సత్యనారాయణ, అరుణ్, నీలపాల సూరిబాబు పాల్గొన్నారు.



కుమార్తెతో కలిసి క్రైస్తవ గీతాలు ఆలపిస్తున్న పాస్టర్ ప్రభుదాస్

పనసపాడులో క్రిస్మస్ వేడుకలు

సామర్లకోట, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పనసపాడు పల్లపు వీధిలో గల యెహోవాయీరే ప్రార్థనా మందిరం వార్షికోత్సవం సందర్భంగా సోమవారం ప్రత్యేక క్రిస్మస్ వేడుకలు నిర్వహించారు. పాస్టర్ పీటర్ క్రిస్మస్ సందేశాన్ని అందించారు. పలువురు క్రైస్తవ గీతాలు ఆలపించారు. అనంతరం ప్రేమ విందు ఏర్పాటుచేశారు. పాస్టర్ ఎస్.ప్రభుదాస్ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో నొక్కి ఛాయా, ఏంజెల్‌తో పాటు అధిక సంఖ్యలో క్రైస్తవ విశ్వాసులు పాల్గొన్నారు.



వెంకయ్యనాయుడికి పుష్పగుచ్ఛం ఇస్తున్న పద్మజ

మాజీ ఉప రాష్ట్రపతిని కలిసిన పద్మజ

సామర్లకోట, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి): మాజీ ఉప రాష్ట్రపతి ముప్పవరపు వెంకయ్యనాయుడిని రాష్ట్ర సివిల్ సప్లయిస్ కార్పొరేషన్ డైరెక్టర్, బీజేపీ జిల్లా నాయకురాలు తుమ్మల పద్మజ సోమవారం మర్యాదపూర్వకంగా కలిసి పూలమొక్క అందించి అభినందించారు. బీజేపీ నాయకుడు కంటిపూడి సర్వారాయుడు స్వగృహంలో జరిగిన ప్రత్యేక కార్యక్రమంలో వారు పాల్గొన్నారు. కూటమి ప్రభుత్వం సంయుక్తంగా నిర్వహిస్తున్న పలు కార్యక్రమాలను వెంకయ్యనాయుడికి సమగ్రంగా వివరించారు. ప్రభుత్వం ధాన్యం కొనుగోలు కేంద్రాల ద్వారా రికార్డు స్థాయిలో ధాన్యాన్ని కొనుగోలు చేయడమే గాక 24 గంటలు ముందుగానే రైతుల ఖాతాల్లో సొమ్ములు జమ చేస్తారని వివరించిన పద్మజను వెంకయ్యనాయుడు అభినందించారు.

నేటితో ముగియనున్న స్పాట్ అడ్మిషన్లు

కాకినాడ రూరల్, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి): కాకినాడ పీఆర్ ప్రభుత్వ అటానమస్ డిగ్రీ కళాశాలలో మిగిలిన పీజీ సీట్ల భర్తీకి స్పాట్ అడ్మిషన్లు నిర్వహించనున్నామని ప్రిన్సిపాల్ డాక్టర్ కందుల ఆంజనేయులు తెలిపారు. ఆసక్తి గల విద్యార్థులు ప్రవేశ పరీక్షల్లో అర్హత సాధించకపోయినా, సాధించినా, అసలు పరీక్ష రాయకపోయినా సంబంధిత సర్టిఫికెట్లతో మంగళవారం సాయంత్రంలోపు హాజరుకావాలన్నారు. ఇతర వివరాలకు కళాశాల అడ్మిషన్ల కమిటీ కన్వీనర్ డాక్టర్ కె.లక్ష్మణరావును 9440025354 నెంబర్లో సంప్రదించాలని ప్రిన్సిపాల్ ఆంజనేయులు సూచించారు.

విజ్ఞాన, విహార యాత్ర

సర్పవరం జంక్షన్, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి): ఏపీఎస్పీ హైస్కూలు హెచ్ఎం సత్యవోలు శ్రీనివాస్ ఆధ్వర్యంలో 77 మంది విద్యార్థులను సోమవారం రాజమహేంద్రవరం విజ్ఞాన, విహార యాత్రకు తీసుకెళ్లారు. వారికి రాజమహేంద్రవరం రోడ్ కం రైలు బ్రిడ్జి, ధవళేశ్వరం కాటన్ బ్యారేజ్, కాటన్ మ్యూజియం, ఇస్కాన్ టెంపుల్, బొమ్మూరులోని సైన్స్ మ్యూజియం, కడియపులంక నర్సరీలను చూపించినట్టు సీనియర్ ఉపాధ్యాయుడు చామంతి నాగేశ్వరరావు తెలిపారు. పది మంది ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

రుద్రయాగం పేరుతో అక్రమ వసూళ్లపై విచారణ

తాళ్లరేవు, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి): ఉప్పంగల రామలింగేశ్వర ఆలయంలో రుద్రయాగం పేరుతో ఈవో సోమరాజు, అర్చకుడు కొండూరి సత్యనారాయణమూర్తి అక్రమ వసూళ్లకు పాల్పడ్డారని, దేవుడిపై భక్తితో ఉన్న గ్రామస్తులు, భక్తులను అవమానించారని గ్రామానికి చెందిన వంగా త్రిమూర్తులుతో పాటు పలువురు దేవదాయ శాఖ కమిషనరుకు ఫిర్యాదు చేశారు. ఆయన ఆదేశాలతో సహాయ కమిషనరు కె.నాగేశ్వరరావు సోమవారం ఇరువర్గాలతో కాకినాడలోని దేవదాయ శాఖ కార్యాలయంలో విచారణ జరిపారు. రుద్ర యాగానికి ఎండోమెంట్ పర్మిషన్ లేదని, జరిగిన అవకతవకలపై పూర్తి విచారణ చేపట్టి బాధ్యులపై చర్యలకు ఉన్నతాధికారులకు తెలియజేస్తామని చెప్పారు.

నేడు మల్లేపల్లి సర్పంచ్ ప్రమాణ స్వీకారం

గండేపల్లి, డిసెంబరు 8(ఆంధ్రజ్యోతి): మండలంలో మల్లేపల్లి సర్పంచ్ బలిరెడ్డి వరలక్ష్మి ఇటీవల మృతిచెందారు. అయితే ఉప సర్పంచ్‌గా ఉన్న దొమ్మా శ్రీను మంగళవారం సర్పంచ్‌గా బాధ్యతలు చేపట్టనున్నారు. సర్పంచ్‌గా బాధ్యతలు చేపట్టనున్న దొమ్మా శ్రీనుకు పలువురు అభినందనలు తెలిపారు.

రంపచోడవరం

• రంపచోడవరం • మారేడుమిల్లి • రాజవొమ్మంగి • అడ్డతీగల • వై రామవరం • గంగవరం • దేవీపట్నం • చింతూరు • కూనవరం • వీఆర్ పురం • ఎటపాక

ఐటీడీఏ గ్రీవెన్స్‌కు 136 అర్జీలు


అర్జీదారులతో మాట్లాడుతున్న ఐటీడీఏ పీవో స్మరణ్ రాజ్

రంపచోడవరం, డిసెంబరు 8(ఆంధ్రజ్యోతి): ఐటీడీఏ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదికలో ఐటీడీఏ పీవో స్మరణ్‌రాజ్, ఏపీవో(జీ) డీఎన్వీ రమణ, ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ ఐ.శ్రీనివాసరావు, సబ్ కలెక్టర్ కార్యాలయ పరిపాలన అధికారిణి ఎం.సావిత్రి ప్రజల నుంచి అర్జీలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఐటీ డీఏ పీవో మాట్లాడుతూ జూనియర్ కళాశాల, ఇండస్ట్రియల్ పార్క్, తాగునీటి ట్యాంకులు ఏర్పాటు, ఆర్‌అండ్‌ఆర్ కాలనీలలో మౌలిక సదుపాయాలు కల్పించాలని కోరుతూ 136 అర్జీలు అందాయన్నారు. ఇకపై ప్రతి సోమవారం పీజీఆర్ఎస్‌లో అందిన పెండింగ్ అర్జీలపై సెక్టార్ అధికారులతో రివ్యూ నిర్వహిస్తామన్నారు. ఆయా శాఖల అధికారులు పూర్తి సమాచారంతో హాజరుకావాలని సూచించారు. కార్యక్రమంలో డిప్యూటీ డైరెక్టర్లు రుక్మాండయ్య, షరీఫ్, డీఎల్డీవో కె.కోటేశ్వరరావు, డీఈవో వై.మల్లేశ్వరరావు, ఏడీ ఏలు సావిత్రి, రామ్మోహన్, పీహెచ్‌వో దేవదానం, జీసీసీ డీఎం జయశ్రీ, ఏడీఎంహెచ్‌వో సరిత, ఈఈ కనకేశ్వరరావు, తహశీల్దారు బాలాజీ, ఎంపీడీవో ప్రసాద్, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

'ఎస్ఎస్ఏ సిల్వర్ జూబ్లీ నిర్వహించాలి'


ఐటీడీఏ పీవోకు వినతిపత్రం ఇస్తున్న ఎస్టీ కమిషన్ చైర్మన్

రంపచోడవరం, డిసెంబర్ 8 (ఆంధ్రజ్యోతి): గిరిజన విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించే లక్ష్యంతో కేంద్ర ప్రభుత్వం సర్వశిక్ష అభియాన్ (ఎస్ఎస్ఏ) కార్యక్రమం ప్రారంభించి 25 సంవత్సరాలు పూర్తయినందున సిల్వర్ జూబ్లీ నిర్వహించాలని రాష్ట్ర ఎస్టీ కమిషన్ చైర్మన్ ఎస్.బొజ్జిరెడ్డి సోమవారం ఐటీడీఏ పీవో స్మరణ్‌రాజ్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు. 2000లో అప్పటి ప్రధాని అటల్ బిహారీ వాజ్‌పేయి కార్యక్రమాన్ని ప్రారంభించారన్నారు. ఎస్టీ కమిషన్ సభ్యురాలు గొర్లె సునీత, మాజీ ఎమ్మెల్యే శీతంశెట్టి వెంకటేశ్వరరావు, డీఎంఎస్ మూర్తి, మల్లిరెడ్డి చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ పణీంద్ర ఐటీడీఏ పీవోను కలిసిన వారిలో ఉన్నారు.

అక్రమ మైనింగ్‌లు నిలుపుదల చేయాలి

● జిల్లా కలెక్టర్‌కు వినతిపత్రం


కలెక్టర్‌కు వినతిపత్రం ఇస్తున్న ఆదివాసీ నాయకులు

రంపచోడవరం, డిసెంబరు 8(ఆంధ్రజ్యోతి): అల్లూరి జిల్లా పరిధిలో నడుస్తున్న అక్రమమైనింగ్‌లు నిలుపుదల చేయాలి కోరుతూ ఆదివాసీ సంక్షేమ పరిషత్ ఆధ్వర్యంలో సోమవారం పాడేరులో జిల్లా కలెక్టరేట్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించినట్టు ఆదివాసీ సంక్షేమ పరిషత్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కుంజ శ్రీను తెలిపారు. ఈమేరకు జిల్లా కలెక్టర్ ఏఎస్ దినేష్‌కుమార్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు. సంఘ రాష్ట్ర అధ్యక్షుడు కాకి మధు మాట్లాడుతూ నరసాపురం క్వారీలో వలన నష్టపోతున్న బాధితులపై దాడులు చేయడమే కాకుండా తప్పుడు కేసులు బనాయిస్తున్నారని ఆరోపించారు. బాధితులపై దాడులు చేయించిన అధికారులపై ఎస్సీఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేయాలని డిమాండ్ చేశారు. ధర్నాలో సంఘ నాయకులు వంతల నాగేశ్వరరావు, పొట్టిక శ్రీను వాసు, తీగల బాబురావు, చండాలోహిదాసులు, ఎడ్ల సూర్యనారాయణ, పీతా ప్రసాద్, బల్లెం గంగాభవాని, పొట్టిగా అర్జున్‌రావు, భూసరి సావిత్రి, బచ్చల మంగ, కోపూరి అన్నపూర్ణ పాల్గొన్నారు.

నూరు శాతం ఉత్తీర్ణత సాధించేలా చర్యలు చేపట్టాలి

రంపచోడవరం, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి): పదో తరగతి విద్యార్థులు నూరుశాతం ఉత్తీర్ణత సాధించేలా చర్యలు చేపట్టాలని ఐటీడీఏ పీవో స్మరణ్ రాజ్ అధికారులను ఆదేశించారు. సోమవారం సాయంత్రం ఆయన స్థానిక పీఎంఆర్‌సీలో విద్యాశాఖాధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా పీవో మాట్లాడుతూ 100రోజుల కార్యక్ర మం ద్వారా విద్యార్థులకు మెరుగైన శిక్షణ ఇవ్వాలన్నారు. సీఆర్‌పీలు ప్రతి పాఠశాలను పరిశీలించి నివేదికలు సమర్పించాలన్నారు. బడి బయటి పిల్లలను గుర్తించి దగ్గర్లోని పాఠశాలల్లో చేర్పించాలన్నారు. అంగన్వాడీ కేంద్రాలలో బాలబాలికలకు ఆటపాటలతో పాటు చదువుపై దృష్టిసారించేలా చర్యలు చేపట్టాలన్నారు. కార్యక్రమంలో డిప్యూటీ డైరెక్టర్ రుక్మాండయ్య, డీఈవోవై.మల్లేశ్వరరావు, మండల విద్యాశాఖాధికారులు ముత్యాలరావు, త్రిమూర్తులు, శ్రీనివాసరావు, ఏటీడబ్ల్యువో జె.శంభుడు, బీఎస్ కుమార్, ఏటీవో జగన్, చైల్డ్ వెల్ఫేర్ అధికారిణి డి.శాంతిమతి, సీడీపీవోలు కె.ఉమా, క్రాంతికుమారి, వి.సుచరితా, డి.సుజాత, ఎల్. శాంతి, సీఆర్పీలు పాల్గొన్నారు.

వాహనాల తనిఖీ

మోతుగూడెం, డిసెంబరు 8(ఆంధ్రజ్యోతి): చింతూరు మండలం మోతుగూడెం పోలీస్ చెక్‌పోస్ట్ వద్ద వాహనాలు తనిఖీలు నిర్వహించారు. మావోయిస్టు వారోత్సవాలు జరుగుతున్న కారణంగా ఆఖరి రోజు కావడంవల్ల మో తుగూడెం పోలీస్‌స్టేషన్‌వద్ద ప్రతి వాహనాన్ని మోతుగూడెం ఎస్ఐ ఎస్‌కే సాదిక్ తన సిబ్బందితో పరిశీలించారు. ఎస్ఐ రాజేశ్వరరావు, హెడ్ కానిస్టేబుల్ మురళి, శ్రీను, పురుషోత్తం, సన్నీ, సీఆర్పీఎఫ్ఏ పార్టీ బెటాలియన్ పాల్గొన్నారు

రేఖపల్లి గ్రామాన్ని పోలవరం ముంపు జాబితాలో చేర్చాలి

వీఆర్‌పురం, డిసెంబరు 8(ఆంధ్రజ్యోతి) వీఆర్‌పురం మండల కేంద్రాన్ని ఆనుకొని ఉన్న రేఖపల్లి గ్రామాన్ని పో లవరం ముంపు జాబితాలో చేర్చాలని మండల వైసీపీ, సీపీఎం నాయకులు సోమవారం ధవలేశ్వరంలోని పోల వరం అడ్మినిస్ట్రేషన్ అధికారి వి.అభిషేక్‌ను కలసి వినతి పత్రాన్ని అందజేశారు. ఇక్కడ పరిస్థితులను మండల వైసీపీ నాయకుడు మాదిరెడ్డి సత్యనారాయణ ఆయనకు వివరించారు. అందుకు ఆయన సానుకూలంగా స్పందించి విషయాన్ని ప్రభుత్వం దృష్టికి తీసుకెళతానని హామీ ఇచ్చారు. రేఖపల్లి సర్పంచ్ పూనెం సరోజిని, ఎంపిటిసి పూనెం ప్రదీప్‌కుమార్, నాయకు లు సీహెచ్ బాలు, గంగులు, పంకు సత్తిబాబు, చీమల కాంతారావు, త్రినాధ్‌రెడ్డి పాల్గొన్నారు.

మందులు, బేబీ కిట్లు ఉచితంగా అందజేత

చింతూరు, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి): సమారిటన్ ఆఫ్ నేషనల్ స్వచ్ఛంద సంస్థ చింతూరు ఏరియా ఆసుపత్రికి సోమవారం బేబీ కిట్లు, మందులు విరాళంగా అంద జేసింది. వీటిలో రూ.1లక్ష విలువైన మందులు, రూ. 60 వేలు విలువగల బేబీ స్లీపింగ్ కిట్స్ ఉన్నాయి. హైదరాబాద్ కేంద్రంగా పనిచేస్తున్న సంస్థ ప్రతినిధి మాట్లాడుతూ తమ సంస్థనేతృత్వంలో గ్రామీణ ప్రాంతాలలో బలహీనమైన చిన్నారులు ఆరోగ్య పరిస్థితులు మెరుగుపర్చే దిశగా పనిచేస్తున్నామన్నారు. ఈమేరకు చింతూరు ఏరియా ఆసుపత్రికి బేబీ స్లీపింగ్ కిట్లు, మందులు అందజేశామన్నారు. అనంతరం ఏరియా ఆసుపత్రి సూపరింటెండెంట్ డా. కోటిరెడ్డి మాట్లాడారు. సమారిటన్ ఆఫ్ నేషనల్ స్వచ్ఛంద సంస్థ ఇప్పటికి పలుమార్లు చింతూరు ఏరియా ఆసుపత్రికి విరాళాల రూపంలో బేబీ స్లీపింగ్ కిట్లు, మందులు అందజేశారన్నారు.

ఎన్టీఆర్ ట్రస్టు వైద్య శిబిరంలో 180 మందికి పరీక్షలు

వై.రామవరం, డిసెంబరు 8(ఆంధ్రజ్యోతి): వై.రామవరం ఎంపీడీవో కార్యాలయ ఆవరణలో సోమవారం నిర్వహించిన ఎన్టీఆర్ ట్రస్టు ఉచిత వైద్య శిబిరంలో 180మంది వైద్య పరీక్షలు చేయంచుకున్నారు. కంటి పరీక్షలు, బీపీ, షుగర్, కాళ్ల నొప్పులు తదితర జనరల్ చెకప్‌లు ఈ శిబిరంలో నిర్వహించారు. రాజమహేంద్రవరం జీఎస్ఎల్ ఆసుపత్రి వైద్యులు, ట్రస్టు మేనేజర్ శ్రీకాంత్, టీడీపీ మండలాధ్యక్షుడు పల్లాల కాంతారెడ్డి, మాజీ జడ్పీటీసీ పల్లాల రమణారెడ్డి, కుప్పా శ్రీను, సాంబమూర్తి, కృష్ణారెడ్డి, హెల్త్ సిబ్బంది పాల్గొన్నారు.

ముమ్మరంగా వరి కోతలు

మోతుగూడెం, డిసెంబరు 8(ఆంధ్రజ్యోతి): చింతూరు మండలం చదలవాడ పంచాయతీ మెట్టవాడ గ్రామంలో తుఫాను ముప్పు తొలగడంతో రైతులు పొలం పనుల్లో నిమగ్నమయ్యారు. ఇటీవల తుపాను ప్రభావంతో తేలిక పాటి జల్లుతో మోస్తారు వర్షాలుపడ్డాయి. దీంతో కోతకు వచ్చిన వరి పంట దెబ్బతింటుందని రైతులు ఆందోళన చెందారు. తుపాను ప్రభావం లేకపోవడంతో వరి కోతల పనుల్లో రైతులు నిమగ్నమయ్యారు.

జగ్గంపేట

• జగ్గంపేట • తుని • ప్రత్తిపాడు

క్రీస్తు బోధనలు ప్రపంచానికి ఆదర్శం

ఎమ్మెల్యే వరుపుల సత్యప్రభ


ఏలేశ్వరంలో క్రిస్మస్ వేడుకల్లో పాల్గొన్న ఎమ్మెల్యే సత్యప్రభ


రౌతులపూడిలో క్రిస్మస్ కేక్ తినిపిస్తున్న ఎమ్మెల్యే వరుపుల సత్యప్రభ

రౌతులపూడి, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి): క్రీస్తు బోధనలు ప్రపంచానికి ఆదర్శమని ప్రత్తిపాడు ఎమ్మెల్యే వరుపుల సత్యప్రభ అన్నారు. రౌతులపూడిలో సోమవారం యునైటెడ్ పాస్టర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో పాస్టర్స్ ఫ్యామిలీ మెగా క్రిస్మస్ వేడుకలు నిర్వహించారు. ఎమ్మెల్యే కేక్ కట్ చేసి ఫెలోషిప్ సభ్యులకు క్రిస్మస్ శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో టీడీపీ మండలాధ్యక్షుడు తమరాల సత్యనారాయణ, ఎంపీపీ గంటి మళ్ల రాజ్యలక్ష్మి, కత్తిపూడి సత్రం చైర్మన్ సోమరౌతు చంద్రమౌళి, మాజీ ఎంపీపీ ఇటంశెట్టి సూర్యభాస్కరరావు, మాజీ సర్పంచ్ ఫైల సాంబ శివరావు, సొసైటీ అధ్యక్షుడు ఫైల ఫైడిరాజు పాల్గొన్నారు.

ఐక్యమత్యంతో సాగుదాం

ఏలేశ్వరం, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి): ఐక్యమత్యంగా ముందుకు సాగి నవ సమాజాన్ని నిర్మిద్దామని ఎమ్మెల్యే వరుపుల సత్యప్రభ అన్నారు. సోమవారం ఏలేశ్వరంలోని ఒక ప్రైవేటు ఫంక్షన్‌హాల్‌లో మండల పాస్టర్స్ ఫెలోషిప్ నేతృత్వంలో ముందస్తు క్రిస్మస్ వేడుకలు నిర్వహించారు. ముఖ్యఅతిథిగా ఎమ్మెల్యే పాల్గొని ప్రత్యేక ప్రార్థనలు చేశారు. కేక్‌ను కట్ చేసి పంచారు. క్రైస్తవ మత పెద్దలు, పాస్టర్లు ఎమ్మెల్యేను ఘనంగా సత్కరించారు. కౌన్సిలర్లు మూది నారాయణస్వామి, అలమండ చలమయ్య, బొదిరెడ్డి గోపి, నాయకులు బ్యాంకు రాజు, పెంటకోట మోహన్, చిక్కాల లక్ష్మణరావు, వైబోగుల సుబ్బారావు, ఎన్.ఈశ్వరుడు ఉన్నారు.

అన్న క్యాంటీన్‌లో పేదలకు అన్నదానం

జగ్గంపేట, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి): జగ్గంపేట ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూ, టీడీపీ జిల్లా అధ్యక్షుడు జ్యోతుల నవీన్ ఆశీస్సులతో దాతల సహకారంతో ప్రతీ సోమవారం ఎన్టీఆర్ విగ్రహం వద్ద నిర్వహిస్తున్న ఉచిత అన్నా క్యాంటీన్‌లో ఈవారం జగ్గంపేట మండలం మల్లిశాల గ్రామానికి చెందిన మట్టే శ్రీనివాస్, మట్టే సింగర పద్మరాజు, మట్టే శ్రీహర్ష ఆర్థిక సహాయంతో పేదలకు అన్నదానం నిర్వహించారు. ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూ హాజరై అన్న క్యాంటీన్ ప్రారంభించి పేదలకు అన్నం వడ్డించారు. జగ్గంపేటలో ప్రభుత్వ అన్న క్యాంటీన్ భవనం పూర్తయిందని త్వరలోనే ప్రారంభిస్తామన్నారు. కార్యక్రమంలో మార్కెట్ కమిటీ చైర్మన్ అడపా భరత్, టీడీపీ మండలాధ్యక్షుడు జీను మణిబాబు, ఆర్యవైశ్య డైరెక్టర్ కొత్త కొండబాబు, మద్దాల సత్యనారాయణ, సత్యనారాయణ, సర్వసిద్ధి లక్ష్మణరావు, ముండ్రు ఎర్రబాబు, రాయి సాయి, వేములకొండ జోగారావు, పిలా మహేష్, బద్ది సురేష్, యల్లమిల్లి సీఎం, దాపర్తి సీతారామయ్య, మారిశెట్టి రాధా, నకిరెడ్డి సూర్యవతి, ఎండి కాజా, సేవా వెంకన్న బాబు, సలాపు చిన్న అప్పారావు, కానవ రెడ్డి నాగబాబు, కోడూరి రమేష్, బండారు నాని తదితరులు ఉన్నారు.


పేదలకు భోజనాలు వడ్డిస్తున్న ఎమ్మెల్యే నెహ్రూ


తుని డీసీసీబీ బ్యాంక్ ఎదుట ధర్నా చేస్తున్న ఉద్యోగులు

సహకార సంఘాల ఉద్యోగుల ధర్నా

తుని రూరల్, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి): సహకార సంఘాల ఉద్యోగులు తునిలో ఆ శాఖ ఎదుట ధర్నాకు దిగారు. తమ న్యాయబద్ధమైన కోర్కెలు నెరవేర్చాలని డిమాండ్ చేశారు. జీవో నెంబరు 36ను అమలుచేయాలని బ్యాంక్ ఎదుట ధర్నా చేపట్టారు. మద్దతుగా పాల్గొన్న సీఐటీయూ నాయకుడు శ్రీనివాస్ మాట్లాడారు. జీవో నెంబరు 36ను ప్రభుత్వం అమలు చేయాలని జీవో ఇచ్చి ఏడేళ్లయినా అమలు చేయండా కాలయాపన చేస్తున్నారని ధ్వజమెత్తారు. 2019 నుంచి వేతన సవరణ చేయలేదని గ్రాడ్యుటీ అమలు చేయాలన్నారు. 2019 తరువాత చేరిన ప్రతి ఒక్కరిని రెగ్యులర్ చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సహకార ఉద్యోగులు నాయకులు రామ్‌నాయుడు, సింహాచలం, సతీష్, శివ, సత్యనారాయణ తదితరులు ఉన్నారు.

టిప్పర్లపై కేసుల నమోదు


లారీలను తనిఖీ చేస్తున్న రోడ్డు రవాణా అధికారులు

తొండంగి, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి): భద్రతా నియమాలు పాటించకుండా రవాణా చేస్తున్న టిప్పర్ లారీలపై స్పెషల్ డ్రైవ్ చేపట్టి కేసులు నమోదు చేసినట్లు కత్తిపూడి మోటార్ వెహికల్ ఇన్‌స్పెక్టర్ బి.శ్రీనివాసు తెలిపారు. సోమవారం ఆయన తొండంగిలో మట్టి రవాణా చేస్తున్న టిప్పర్ లారీలను పరిశీలించి రికార్డులు తనఖీ చేశారు. నిబంధనలకు విరుద్ధంగా ఉన్న 8 లారీలపై కేసు నమోదు చేశారు. రెండోసారి కూడా నిబంధనలు ఉల్లంఘిస్తే లైసెన్స్ రద్దుచేస్తామని తెలిపారు.

డ్రైనేజీ నిర్మాణం ప్రారంభం

తుని రూరల్, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి): మండలంలో రాజుపేట గ్రామంలో ఏళ్ల తరబడి తిష్టవేసిన సమస్యలు ఎమ్మెల్యే దివ్య చొరవతో పరిష్కారం అవుతున్నాయి. ఇప్పటికే రూ.30లక్షల నిధులు ఫైబడి రాజపేట గ్రామంలో ఖర్చు చేశారు. ఈ నిధులతో గ్రామంలో సీసీ రోడ్లు ఏర్పాటు కాగా తాజాగా గ్రామంలో డ్రైనేజీ నిర్మాణానికి టీడీపీ నాయకుడు యనమల రాజేష్ శ్రీకారం చుట్టారు. ఆయన వెంట చింతమనీడి అబ్బాయి తదితరులున్నారు.

'ఆదిత్య'లో అటల్ ఫ్యాకల్టీ డెవలప్‌మెంట్ ప్రోగ్రాం

గండేపల్లి, డిసెంబరు 8(ఆంధ్రజ్యోతి): సూరంపాలెంలోని ఆదిత్య కాలేజ్ ఆఫ్ ఇంజనీరింగ్ అండ్ టెక్నాలజీలో అఖిల భారత సాంకేతిక విద్యా మండలి సౌజన్యంతో నిర్వహిస్తున్న అటల్ ఫ్యాకల్టీ డెవలప్‌మెంట్ ప్రోగ్రాం ఆఫ్‌లైన్ శిక్షణ కార్యక్రమం 6జి వైర్‌లెస్ కమ్యూనికేషన్ టెక్నిక్‌లు అనే అంశంపై డిసెంబరు 8 నుంచి 13 వరకు కొనసాగుతుందని ప్రో వైస్ చాన్సలర్ డాక్టర్ పి.రమేష్ తెలిపారు. 6జి విభాగంలో పరిశోధకు ప్రపంచ వ్యాప్తంగా డిమాండ్ పెరుగుతుందని అధ్యాపకులు, పరిశోధకులు దీన్ని ఉపయోగించుకోవాలన్నారు. సాంకేతికతపై అధ్యాపకులు అవగాహన పెంచేందుకు ఇది వేదికన్నారు.

'రబీ పంటలో ఎరువుల వినియోగం తగ్గించాలి'

తొండంగి, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి): రబీ పంటలో ఎరువుల వినియోగాన్ని తగ్గించాలని మండల వ్యవసాయాధికారి పద్మశ్రీ తెలిపారు. త్వరలో పంపా ఆయకట్టు పరిధిలో రబీ పంటకు నీరు విడుదల చేయనున్నందున రైతులు తమ పంటకు అవసరమైన మేరకే ఎరువును వినియోగించాలన్నారు. రబీ పంటకు అవసరమైన వరి విత్తనాలు ప్రైవేటు డీలర్ల వద్ద అందుబాటులో ఉన్నాయన్నారు. ఎరువు వినయోగంపై అవగాహన కల్పించే నిమిత్తం సర్పంచ్ అధ్యక్షతన గ్రామ కమిటీలు ఏర్పాటుచేస్తామని పద్మశ్రీ అన్నారు.

'ఆదర్శప్రాయుడు అప్పారావు'

జగ్గంపేట, డిసెంబరు 8(ఆంధ్రజ్యోతి): శ్రీ సత్యసాయి సేవా సంస్థల్లో విశిష్టమైన సేవలందించిన అప్పారావు మాస్టారు నేటి యువతరానికి ఆదర్శప్రాయుడని సేవా సంస్థల జిల్లా అధ్యక్షుడు యార్లగడ్డ గోవిందరాజులు అన్నారు. సోమవారం జగ్గంపేట టీచర్స్ కాలనీలో శ్రీ సత్యసాయి బాలవికాస్ గురువు, విశ్రాంత ఉపాధ్యాయుడు మండపాక అప్పా రావు మాస్టారు సంస్మరణ కార్యక్రమానికి ఆయన అధ్యక్షత వహించి మాట్లాడారు. కార్యక్రమంలో తూర్పుగోదావరి జిల్లా సత్యసాయి సేవా సంస్థల అధ్యక్షుడు బులుసు వెంకటేశ్వర్లు, తుని సబ్ జోన్ కన్వీనర్ తుమ్మలపల్లి జోగేంద్రనాధ్, కాకినాడ జిల్లా మహిళా సేవాదళ్ సమన్వయకర్త చిట్టి కామేశ్వరి పాల్గొన్నారు.


నియోజకవర్గ విజనరీ యాక్షన్ ప్లాన్ కమిటీ అధికార బృందంతో చర్చిస్తున్న ఎమ్మెల్యే సత్యప్రభ

ప్రతి గ్రామాన్ని అభివృద్ధి చేయాలి

అధికారులకు ఎమ్మెల్యే సత్యప్రభ ఆదేశాలు

ప్రత్తిపాడు, డిసెంబరు 8(ఆంధ్రజ్యోతి): నియోజకవర్గంలో ప్రతి గ్రామాన్ని దత్తత తీసుకుని అభివృద్ధి చేయాలని ఎమ్మెల్యే వరుపుల సత్యప్రభ అధికారులను ఆదేశించారు. పెదశంకర్లపూడి టీడీపీ కార్యాలయం వద్ద సోమవారం నియోజకవర్గ విజనరీ యాక్షన్ ప్లాన్ కమిటీ అధికార బృందంతో ఎమ్మెల్యే సమావేశం నిర్వహించారు. పీజీఆర్ఎస్ ద్వారా ప్రజల నుంచి వచ్చిన ఫిర్యాదుల పరిష్కారంపై చర్చించారు. సీఎస్ఆర్ నిధుల సేకరణ, గ్రామాల్లో మౌలిక వసతుల కల్పన తదితర ప్రజా సమస్యలపై అధికారులు ప్రణాళికలు సిద్ధం చేయాలని ఎమ్మెల్యే ఆదేశించారు. సమావేశంలో ఎంపీడీవో ఎంవీఆర్ కుమార్‌బాబు, అధికారులు, సచివాలయాల సిబ్బంది, టీవీఏఏఎం సభ్యులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యేను కలిసిన ఆసుపత్రి సూపరింటెండెంట్: ప్రత్తిపాడు ఆసుపత్రి సూపరింటెండెంట్‌గా బాధ్యతలు స్వీకరించిన సౌమ్య సోమవారం ఎమ్మెల్యే సత్యప్రభను కలిశారు. ఆసుపత్రికి వచ్చే రోగులకు మెరుగైన వైద్య సేవలందించాలని ఎమ్మెల్యే సూచించారు. కార్యక్రమంలో ఆసుపత్రి అభివృద్ధి సభ్యులు వి.నాని పాల్గొన్నారు.


బహుమతులు సాధించిన ఒమ్మంగి విద్యార్థులు

కరాటేలో విద్యార్థులకు బహుమతులు

ప్రత్తిపాడు, డిసెంబరు 8(ఆంధ్రజ్యోతి): కరాటే జూనియర్స్ విభాగంలో ఒమ్మంగి ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులు రాష్ట్రస్థాయిలో బహుమతులు సాధించినట్లు ఆ పాఠశాల ప్రధానో పాధ్యాయులు సోమవారం తెలిపారు. ఒమ్మంగి ప్రాథమిక పాఠశాల విద్యార్థి నిమ్మల కాశి నాగ వీరవెంకటసతీష్, ఒమ్మంగి హైస్కూల్ విద్యార్థి నిమ్మల మనోజ్‌కుమార్ అనపర్తిలో జరిగిన రాష్ట్రస్థాయి కరాటే పోటీల్లో ప్రతిభ కనబర్చి ప్రథమ, ద్వితీయ బహుమతులు సాధించినట్టు ప్రధాన ఉపాధ్యాయులు ఎం.కిరణ్మయి, ఎం.రాజ బాబు తెలిపారు. విద్యార్థులను, కరాటే మాస్టారు పి.మంగయ్యలను హెచ్‌ఎం, ఉపాధ్యాయులు అభినందించారు.

బాధిత కుటుంబానికి ఆర్థికసాయం

ప్రత్తిపాడు, డిసెంబరు 8(ఆంధ్రజ్యోతి): ప్రత్తిపాడులో పేద కుటుంబానికి చెందిన గనిశెట్టి తాతీలు ఇటీవల మృతి చెందారు. వారి కుటుంబ పరిస్థితిని తెలుసుకున్న కాంగ్రెస్ కమిటీ జిల్లా ఉపాధ్యక్షుడు ధర్నాలకోట శ్రీను సోమవారం బాధిత కుటుంబానికి ఆర్థిక సహాయం అందజేశారు.



ఏలేశ్వరంలో డీసీసీబీ బ్యాంకు మేనేజర్‌కి వినతిపత్రం అందజేస్తున్న సొసైటీ ఉద్యోగులు. పక్క చిత్రంలో ప్రత్తిపాడులో నినాదాలు చేస్తున్న సహకార ఉద్యోగులు

డిమాండ్లు పరిష్కరించాలని సొసైటీ ఉద్యోగుల నిరసన

ఏలేశ్వరం, డిసెంబరు 8(ఆంధ్రజ్యోతి): సమస్యల పరిష్కారం కోరుతూ సోమవారం సహకార సంఘ ఉద్యోగులు నిరసన కొనసాగించారు. సోమవారం స్థానిక డీసీసీబీ బ్యాంకు ఎదుట ధర్నా చేపట్టి బ్రాంచ్ మేనేజర్ రవి కృష్ణకు వినతిపత్రం అందజేశారు. 2019-24 వేతన సవరణ చేపట్టాలని డిమాండ్ చేశారు. సహకార సంఘాల సీఈవోలు జ్యోతుల శ్రీనివాస్, విజయకుమార్, గోపాల కృష్ణ, మణి రాజు, ఆదినారాయణ తదితరులు పాల్గొన్నారు.

ప్రత్తిపాడులో నినాదాలు

ప్రత్తిపాడు, (ఆంధ్రజ్యోతి): ప్రత్తిపాడు డీసీసీబీ బ్యాంక్ బ్రాంచ్ వద్ద సోమవారం సహకార సంఘాల ఉద్యోగులు నల్లబ్యాడ్జీలు ధరించి ఆందోళన నిర్వహించారు. దీర్ఘకాలిక సమస్యలు పరిష్కరించాలని వారు డిమాండ్ చేశారు. బ్రాంచ్ మేనేజర్లు పీవీ రమణ, పీవీ కుక్కుటేశ్వరరావు, సేల్ ఆఫీసర్ సూర్యం తదితరులు ఆందోళన శిబిరాన్ని సందర్శించి సంఘీభావం తెలిపారు. ఈ ఆందోళనలో పీఏసీఎస్‌ల సీఈవోలు నిమ్మల గణేశ్వరరావు, ఒమ్ము కృష్ణ మూర్తి, పసుపులేటి ఏసురత్నం, పంపన వెంకటరమణ, ఉద్యోగులు సుంకర రామారావు, బోడా శివ, ముర్రే అప్పారావు, అడ్డాల శ్రీను, బోడా రాజు, సుంకర సురేంద్ర, సత్యనారాయణ మూర్తి, నారాయణరావు, విజయ్, శివకుమార్ తదితరులు పాల్గొన్నారు.

సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉండాలి

ప్రత్తిపాడు, డిసెంబరు 8(ఆంధ్రజ్యోతి): సైబర్ నేరాలపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ప్రత్తిపాడు సీఐ బి.సూర్య అప్పారావు కోరారు. స్థానిక సర్కిల్ కార్యాలయంలో సోమవారం సైబర్ నేరాలపై అవగాహన కల్పించారు. ఎవరైనా ఫోన్ చేసి ఓటీపీ చెప్పాలని అడిగితే చెప్పకూడదన్నారు. తెలియని ఫోన్ నెంబర్స్ నుంచి కాల్ వస్తే వ్యక్తిగత సమాచారం ఎట్టిపరిస్థితుల్లోనూ వారికి చెప్పకూడదని ఆయన సూచించారు.

ఉచిత హోమియో వైద్య శిబిరం

ప్రత్తిపాడు, డిసెంబరు 8(ఆంధ్రజ్యోతి): రాచపల్లి రమణాశ్రమంలో సోమవారం విశ్వ మానవతా సంస్థ ఫౌండర్ అల్లూరి శ్రీనివాస్ చౌదరి ఆధ్వర్యంలో ఉచిత హోమియో వైద్య శిబిరం నిర్వహించారు. హోమియో వైద్యులు టి.వీరభద్రవర్మ, లక్ష్మి, వినీత పలువురికి వైద్య సేవలందించారు. శిబిరంలో స్వామిరామానంద, ఎల్.తాతాజీ, ఉప్పల తిరుపతిరావు, కారే రామచంద్రరావు, జక్కం త్రిమూర్తులు తదితరులు పాల్గొన్నారు.

అరుణాచలేశ్వరుడికి ప్రత్యేక పూజలు

ప్రత్తిపాడు, డిసెంబరు 8(ఆంధ్రజ్యోతి): రాచపల్లి అడ్డరోడ్డు వద్ద అపీత కుచాంబ అరుణాచలేశ్వరుడికి సోమవారం విశిష్ట పూజలు నిర్వహించారు. మార్గశిర మాసం బహుళపక్షం చవితి సందర్భంగా అరుణాచలేశ్వరుడు, అపీత కుచాంబలకు విశిష్ట పూల అలంకరణ చేశారు. ఆలయ వ్యవస్థాపకుడు స్వామి రామానంద ఆధ్వర్యంలో వేదపండితులు పంచామృతాభిషేకాలు, పంచహారతులు నిర్వహించారు.


ప్రత్యేక అలంకరణలో అమ్మవారు

వాహనాల తనిఖీ

ప్రత్తిపాడు, డిసెంబరు 8(ఆంధ్రజ్యోతి): వాహనదారులు డ్రైవింగ్ లైసెన్స్‌తో పాటు వాహన రికార్డు కలిగి ఉండాలని ఎస్ఐ ఎస్.లక్ష్మీకాంతం చెప్పారు. స్థానిక ఫారెస్ట్ చెక్‌పోస్టు సెంటర్ వద్ద సోమవారం ఎస్ఐ వాహన తనిఖీలు నిర్వహించారు. ఈసందర్భంగా ఎస్ఐ మాట్లాడుతూ వాహనదారులు ట్రాఫిక్ నిబంధనలు పాటించాలన్నారు. కార్యక్రమంలో పోలీస్ సిబ్బంది గోవింద్ తదితరులు పాల్గొన్నారు.


వాహనాలను తనిఖీ చేస్తున్న ఎస్ఐ లక్ష్మీకాంతం

మాజీ ఉప రాష్ట్రపతిని కలిసిన పద్మజ


వెంకయ్యనాయుడికి పుష్పగుచ్ఛం ఇస్తున్న పద్మజ

సామర్లకోట, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి): మాజీ ఉప రాష్ట్రపతి ముప్పవరపు వెంకయ్యనాయుడిని రాష్ట్ర సివిల్ సప్లయిస్ కార్పొరేషన్ డైరెక్టర్, బీజేపీ జిల్లా నాయకురాలు తుమ్మల పద్మజ సోమవారం మర్యాదపూర్వకంగా కలిసి పూలమొక్క అందించి అభినందించారు. బీజేపీ నాయకుడు కంటిపూడి సర్వారాయుడు స్వగృహంలో జరిగిన ప్రత్యేక కార్యక్రమంలో వారు పాల్గొన్నారు. కూటమి ప్రభుత్వం సం యుక్తంగా నిర్వహిస్తున్న పలు కార్యక్రమాలను వెంకయ్యనాయుడికి సమగ్రంగా వివరించారు. ప్రభుత్వం ధాన్యం కొనుగోలు కేంద్రాల ద్వారా రికార్డు స్థాయిలో ధాన్యాన్ని కొనుగోలు చేయడమే గాక 24 గంటలు ముందుగానే రైతుల ఖాతాల్లో సొమ్ములు జమ చేస్తారని వివరించిన పద్మజను వెంకయ్య నాయుడు అభినందించారు.